
ఆంధ్రజ్యోతి



గుంటూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 1 జూలై 2025

రోగుల కృతజ్ఞతే సంతృప్తి

- ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం డాక్టర్
- రోగికి, వైద్యులకు ప్రత్యేకమైన అనుబంధం
- వైద్య వృత్తిపై మక్కువతో వైద్యుల సేవలు..

నేడు వరల్డ్ డాక్టర్స్ డే..

8



పురుగుల బియ్యం.. ప్రభుత్వం సీరియస్




బియ్యంలో పురుగులు పాకుతున్నా ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)

- ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్
- గోదాము మేనేజర్‌పైనా చర్యలకు ఆదేశం
- కొనుగోళ్లలో అవకతవకలే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- సమగ్ర విచారణకు ప్రత్యేక బృందం

తెనాలి, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉండటంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాములో పనిచేసే టెక్నికల్ సిబ్బంది, ఇతర అధికారులు కలిపి మొత్తం ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేసింది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గోదాము మేనేజర్‌పై చర్యలకు ఆదేశించడంతో పాటు, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని చిన్నారులకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బియ్యంలో పురుగులు ఉండటం, అవి తిరుగాడుతుండగానే ప్యాకింగ్ చేసేస్తుండటంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. ముక్కు పురుగులు సంచుల నిండా ఉన్నా.. వాటిని అలానే.. పాఠశాలలకు పంపేందుకు ప్యాకింగ్ చేసి, సిద్ధం చేశారు. దీనిపై సమాచారం అందడంతో ఆంధ్రజ్యోతి పరిశీలించింది. పురుగులు ప్రత్యక్షంగా కనిపించడం, నాణ్యమైన బియ్యం స్థానంలో నాసిరకం బియ్యం కొనుగోలు చేయడం.. ఇందులో భారీ మొత్తంలో మామూళ్ల రూపంలో డబ్బు చేతులు మారడం తదితరాలు వెలుగులోకి రావడంతో.. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను తక్షణ పరిశీలనకు మంత్రి మనోహర్ ఆదేశాలిచ్చారు. ఉన్నతాధికారులు తెనాలి గోదాములో బియ్యం నిల్వలను పరిశీలించారు. వారికి కూడా పురుగుల మయమైన బియ్యం కనిపించడంతో.. నాశిరకం బియ్యం కొనుగోళ్ల కారణంగానే ఈ లోపం జరిగినట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బియ్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఎస్.డబ్ల్యు.సి గోదాముల టెక్నికల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు.దీనిపై సమగ్ర విచారణ కోసం విజయవాడ నుంచి ఒక ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు తెలిసింది. వారు దీనిపై విచారణ జరిపి, లోపం ఎక్కడ జరిగింది? అవకతవకలకు పాల్పడిన సిబ్బంది ఎవరనేది తేల్చాల్సి ఉంది. ఇప్పటికే విచారణ కూడా మొదలుపెట్టినట్టు సమాచారం. త్వరలో పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. ఆ తర్వాతే చేతివాటం చూపిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.


సన్నగిల్లుతున్న లక్ష్యం
మధ్యాహ్న భోజనానికి పురుగుల బియ్యం

సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన పురుగుల బియ్యంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



ఆగంతకులకు రాచమార్గం

- ఈఎఫ్‌టీలోనే అసలు తంటా
- రెల్వే ప్రయాణికుల భద్రత గాలిలో దీపం
- రైళ్లలో దోపిడీలకు టీటీఈలే పరోక్ష కారణం ?

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలోని రిజర్వేషన్ బోగీల్లో భద్రత గాలిలో దీపంలా మారింది. వరుస చోరీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. దీనంతటికీ పరోక్ష కారణం.. టీటీఈల చేతివాటమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్లీపర్, ఏసీ త్రీటైర్ బోగీల్లో ఆగంతకులు దర్జాగా ప్రయాణిస్తున్నారు. ఈ విధానానికి అడ్డుకట్ట వేయాల్సిన రైల్వే శాఖ.. అందుకు విరుద్ధంగా ఆదాయమే పరమావధిగా వ్యవహరిస్తోంది. రిజర్వేషన్ లేని వాళ్లకు ఫైన్లు వేసి మీ ఇష్టం వచ్చిన చోట కూర్చోమని ఈఎఫ్‌టీ(ఎక్సెస్ ఫేర్ టిక్కెట్) రాసి టీటీఈ చేతిలో పెడుతున్నారు. దీనిని అవకాశంగా చేసుకొంటున్న దోపిడీ దొంగలు అర్ధరాత్రి ప్రయాణికులందరూ నిద్రలోకి జారుకున్నాక తమ ప్రతాపం (మిగతా 8వ పేజీలో)

1.70 లక్షల కుటుంబాలకు.. ముందస్తు రేషన్

- ప్రభుత్వం కల్పించిన అవకాశం సద్వినియోగం
- క్యూలైన్ కష్టాలు తప్పాయని వృద్ధులు, దివ్యాంగుల సంతోషం
- ఈ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి



8



● రిజర్వాయర్‌కు ఒక వైపున పూర్తైన ఫస్ట్ లేయర్ ఫాండేషన్

వరద నీటి నిర్వహణ

పర్యాటక ఆకర్షణ

వేగంగా సెంట్రల్ పార్కు రిజర్వాయర్ పనులు

- పూర్తయిన పూడిక తీత
- తుది దశకు ఫస్ట్ లెవెల్ ఫాండేషన్
- వర్షాలకు నీరు చేరకుండా జాగ్రత్తలు
- చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన వరద నీటి నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శాఖమూరులో నిర్మిస్తున్న సెంట్రల్ పార్కులోని 50 ఎకరాల కొండవీటి వాగు రిజర్వాయర్ పూర్తికావొస్తోంది. వర్షాలు పడుతున్నప్పటికీ పనులు ఆగకుండా ఎప్పటి కప్పుడు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. కేవలం రిజర్వాయ ర్‌గానే కాకుండా.. ఒక పర్యాటక ప్రాంతంగా దీనిని తీర్చిదిద్దేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లను సీఆర్డీఏ చేస్తోంది.

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని శాఖమూరు గ్రామంలో నిర్మిస్తున్న 300 ఎకరాల సెంట్రల్ పార్కులో కొండవీటి వాగు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, సీఆర్డీఏ నిర్ణయించింది. కొండవీటి వాగు వరద నీటి నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ రిజర్వాయర్‌ను సెంట్రల్ పార్కులో ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక ఆకర్షణగా ఉంటుందని భావించిన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. కొండవీటి వాగుకు వరద నీరు వచ్చినప్పుడు ఈ రిజర్వాయర్‌ను నింపు తారు. అది కూడా నిండిపోయాక అదనపు ప్రవాహాన్ని నీరుకొండ రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడ కూడా నిండి పోయాక కృష్ణాయపాలెం- కురగల్లు మధ్య నిర్మించే మరో రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అవి కూడా నిండి పోయాక అదనపు నీటిని కృష్ణా నది వైపు నకు వదిలేస్తారు. కృష్ణా నదిలో కూడా వరద ప్రభావం ఎక్కువగా ఉంటే ప్రకాశం బ్యారేజీ వద్ద నిర్మించిన ఎత్తిపోతల యంత్రాల ద్వారా కృష్ణా నదిలోకి తోడి పోస్తారు. ఇలా రాజధాని వరద నీటి (మిగతా 8వ పేజీలో)



రిజర్వాయర్‌లో జరుగుతున్న తొలి దశ ఫాండేషన్ పనులు

అనుమతి ఉంటేనే సభలు, సమావేశాలు



జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు నిర్వహించాలనుకునే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సిందేనని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, మత సంస్థలు, కుల, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు.. మరే ఇతర సంఘాలు వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పరిధిలో పోలీస్‌స్టేషన్ అధికారి వద్ద నిర్దేశించిన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా అనుమతులకు సంబంధించి పోలీసు మార్గదర్శకాలను ఆయన వివరించారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకునే వారు పూర్తి వివరాలను (పేరు, చిరునామా, ఆధార్, ఫోన్ నంబర్లు) అందించాలన్నారు. కార్యక్రమం తేదీ, సమయం, ప్రదేశం, స్థల యజమాని అనుమతి పత్రం, అక్కడ తీసుకునే భద్రత ఏర్పాట్లు, కార్యక్రమానికి వచ్చే మార్గాల వివరాలు.. హాజరయ్యే ప్రముఖులు, వారు వచ్చే మార్గం, వెంట వచ్చే వాహనాల వివరాలు, హాజరయ్యే ప్రజల సంఖ్య.. కల్పించే సదుపాయాలు, డీజే తదితర వివరాలను ఖచ్చితంగా పొందుపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఉపన్యాసాలను, హింసాత్మక పోస్టర్లను ప్రదర్శించడం చేయమని రాతపూర్వక హామీ సమర్పించాల్సి ఉంటుందన్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ నిత్యం అమలులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమం శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉంటే ఏ సమయంలోనైనా చట్టపరంగా రద్దు చేసే అధికారం పోలీస్ శాఖకు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు దృష్టిలో పెట్టుకుని సహకరించాలని ఎస్పీ కోరారు.

పారిశుధ్యంపై దద్దరిల్లిన కౌన్సిల్



- గళం విప్పిన ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, కార్పొరేటర్లు
- అక్రమ హోర్డింగ్‌ల తొలగింపునకు మేయర్ ఆదేశం
- ఎలక్ట్రికల్ విభాగంలో 50 మంది ఉద్యోగులకు అవకాశం
- సమ్మె చేస్తున్న కార్మికులను సస్పెండ్ చేయాలని ఆదేశం

గుంటూరు కార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని పారిశుధ్యం అధ్వానంగా ఉందని కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. సోమవారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) అధ్యక్షతన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనేక ప్రజా సమస్యలపై చర్చించారు. ముందుగా అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి, ఇటీవల మరణించిన నగర మాజీ కార్పొరేటర్ ఏటిగడ్డ సామ్రాజ్యం మృతికి సంతాపంగా కౌన్సిల్ నివాళులర్పించింది. ఐదు నిమిషాలు మౌనం పాటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిలర్లు ప్రార్థించారు. ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో చర్చించుకోవడమే తప్ప ఏ ఒక్కటి కూడా అమలు కావడంలేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఇదే పరిపాలన కొనసాగితే.. ప్రజాప్రతినిధులుగా అందరూ విఫలమైనట్లేనని అభిప్రాయ పడ్డారు. శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉందని, భారీ హోర్డింగ్‌లను తొలగించలేదని, డిస్‌ప్లే బోర్డులను అలానే ఉంచారని, నగరంలో వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా లేదని ఇలా పలు సమస్యలను ప్రస్తావించారు. వీటన్నిటిపై లిఖితపూర్వకంగా సమాధానం కావాలని పట్టుబట్టారు. దీంతో స్పందించిన మేయర్ నాని.. ఇవన్నీ వారంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నగరంలో ఖాళీల స్థలాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్యే మాధవి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.



కౌన్సిల్‌లో పరస్పర వాదనలకు దిగిన టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు

శానిటేషన్ ముసుగులో అక్రమాలు..

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. నగరంలో ప్రైవేట్ శానిటేషన్ ముసుగులో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జీఎంసీ వాహనాలను, పారిశుధ్య కార్మికులను వినియోగించి ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు శానిటేషన్ డబ్బులు వసూలు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గతేడాది నుంచి రామ సేతు, ఐ క్యూబ్ సంస్థలకు ఎందుకు టెండర్లు కంటిన్యూ చేస్తున్నారంటూ మండిపడ్డారు. పదేళ్లుగా ఇక్కడ ప్రైవేట్ శానిటేషన్ టెండర్ల నిర్వహిస్తున్న సంస్థ ఫైల్స్ మిస్ అవ్వడం ఏంటని, డివిజన్‌కి ఎన్ని ట్రాక్టర్లు, డంపర్ బిన్స్ పారిశుధ్య కార్మికులను కేటాయించారో.. తెలపాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు దాటవేత ధోరణి వ్యవహరించారు. అలాగే వీధి లైట్ల నిర్వహణపై కార్పొరేటర్లు గళమెత్తారు. అధికారులు చిత్తశుద్ధి లేనితనంతో మూడు రోజులుగా నగరంలో వీధి లైట్లు వెలగడం లేదని ఆరోపించారు. అలాగే శిశారు, విలీన గ్రామాల్లో పారిశుధ్య అధ్వానంగా ఉందని, దోమల బెడద ఎక్కువైందని వివరించారు.

తమకు స్టడీ టూర్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు మేయర్ రవీంద్రకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఇస్తున్న గౌరవ వేతనానికి అదనంగా రూ.30 వేల ప్రతి నెలా చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. దీనిని ప్రభుత్వ పరిశీలకు పంపుతామని మేయర్ సమాధానం ఇచ్చారు.

నగరంలో అనధికార హోర్డింగ్‌లు ఉన్నాయంటూ కార్పొరేటర్ వెంకటరెడ్డి ఆరోపించారు. దీంతో వాటిని తొలగించాలని మేయర్ ఆదేశించారు. కొల్లి శారద మార్కెట్ షాపుల లీజులను రద్దుచేసి స్వాధీనపరుచుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగంలో 50 మంది ఉద్యోగులను తీసుకోవాలని కౌన్సిల్ తీర్మానించింది. అనుమతి లేకుండా సమ్మె చేస్తున్న నగరపాలక సంస్థ కార్మికులను తక్షణమే సస్పెండ్ చేయాలని మేయర్ ఆదేశించారు. సమ్మెను విరమించకపోతే విధుల్లోకి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, మాధవి, ఎమ్మెల్సీ ఏసురత్నం

ఒక్క రోడ్డు కూడా అందంగా లేదు: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు నగరంలో ఒక్క రోడ్డు కూడా అందంగా లేదు. కనీసం కలెక్టరేట్ రోడ్డు కూడా బ్యూటిఫికేషన్‌కు నోచుకోలేదు. తక్షణమే నగరంలో రోడ్ల సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి. హార్టికల్చర్‌లో 40 మందికి ఉచితంగా జీతాలు ఇస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ తరహాలో గుంటూరులో రోడ్లు సుందరీకరించాలి.

బాధ్యతారాహిత్యంగా సచివాలయ ఉద్యోగులు: ఎమ్మెల్యే మాధవి

నగరంలోని సచివాలయ ఉద్యోగులు బాధ్యత రాహిత్యంగా ఉంటున్నారు. సచివాలయాలకు వెళ్తే ఒక్కరు కూడా ఉండటం లేదు. అదనపు కమిషనర్ నగరంలో సర్వే జరుగుతుందని అంటున్నారు. సచివాలయం వద్ద ఒక ఉద్యోగి ఉండేలా ఉంచామని చెబుతున్నారు. ఆ ఉద్యోగి వాచ్‌మెన్‌లా ఉంటున్నారే కానీ, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. తక్షణమే బాధ్యతా రాహిత్యంగా ఉంటున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి.



రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

శోభాయమానం.. జగన్నాథ రథయాత్ర

తెనాలి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథయాత్ర సోమవారం పట్టణంలో కనుల పండువగా నిర్వహించారు. ఇస్కాన్ తెనాలి సారథ్యంలో జగన్నాథ స్వామి, బలదేవుడు, సుభద్ర మాత కొలువై ఉన్న రథాన్ని భక్తులు లాగేందుకు పోటీపడ్డారు. పూలతో అలంకరించిన రథం శివాజీ చౌక్ నుంచి బోసు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకుంది. అక్కడ గుండిసా మందిరంలో కొలువు చేస్తారు. రథ యాత్రలో భారీ సంఖ్యలో భక్తులు జగన్నాథునికి జేజేలు పలికారు. శోభాయామానంగా సాగిన రథ యాత్రలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. విదేశాల నుంచి వచ్చిన భక్తులు రథ యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీవాసవీ ఆలయంలో కొలువుదీరిన జగన్నాథులకు మంగళవారం సుభద్రదేవికి సౌభాగ్య సారె కార్యక్రమం నిర్వహిస్తారు. మహిళలు పసుపు, కుంకుమ, చందనం, చీర, పూలు, ద్రవ్యాలతో స్వామి వారికి సమర్పించవచ్చని తెలిపారు. విజయవాడకు చెందిన జిజ్ఞాస సాంస్కృతిక సంస్థ క్యూరేషన్‌లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించింది. మేనేజర్ సింహా గౌరదాస్, దుర్గాప్రసాద్, కమలా కాంత దాస్, రోహిణి వైష్ణవి, బత్తుల వెంకటేష్, గీతిక, మీనాక్షి, మేఘన, రవితేజ, మోహనకృష్ణ పాల్గొన్నారు. వైకుంఠపురంలో రథోత్సవం పురస్కరించుకుని 51 విభాగాల్లో పోటీలు నిర్వహించారు.



రథోత్సవం ముందు మహిళల కోలాటం

ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు ఆమోదం

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

మంగళగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు కేంద్రం ఆమోదం తెలిపిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మంగళగిరి 16వ నంబరు జాతీయ రహదారి వద్ద ఎంట్రీ ర్యాంపును ఎగ్జిట్ ర్యాంపుగా మార్చేందుకు ఆమోదం లభించిందని చెప్పారు. దీని ద్వారా ఎయిమ్స్‌ను చేరుకునేందుకు ఇప్పటి వరకు ఉన్న దూరం 4.66 కిలోమీటర్ల నుంచి 1.26 కిలోమీటర్లకు తగ్గనుందని వెల్లడించారు. జాతీయ రహదారిపై మూడు కీలక ప్రాంతాల్లో 13 బోర్డుల ఏర్పాటుకు కూడా అనుమతి వచ్చిందన్నారు. అత్యవసర వైద్యం, రోగులు, ప్రయాణికుల రవాణా, వైద్య సిబ్బంది రాకపోకలకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

38,592 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 41,119 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,592 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,935 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13400	334	9700	13000
273	---	---	నెంబరు. 5	10000	13300
341	10000	13300	273	---	---
సూపర్ 10	---	---	341	10000	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			4884	10000	12500
తేజ	10000	13400	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
షార్క్-1	---	---	తేజ	10000	13500
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	10000	13000
సింజెంటా బ్యాడిగి	---	---	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	---	---	తాలుకాయలు	4500	7000

ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ వెలవెల

● తగ్గిన ప్రయాణికుల రద్దీ ● పడిపోయిన రోజు వారీ చార్జీల ఆదాయం



ప్రయాణికుల్లేక కళావిహీనంగా ఉన్న ఎన్టీఆర్ బస్టాండ్

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి రోజువారీ ప్రయాణికుల రద్దీ క్రమంగా తగ్గుతోంది. నిత్యం కోలాహలంగా ఉండే ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల్లేక వెలవెలబోతోంది. శుభ కార్యాలు పెద్దగా లేకపోవడం.. మరో వైపు విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. సాధారణంగా గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి బస్సులు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. తద్వారా ప్రయాణికులతో ఎన్టీఆర్ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రం గుంటూరు నుంచి రోజువారీగా వేలాది మంది గమ్య స్థానాలకు చేరుతుంటారు. కొన్ని రోజులుగా రోజువారీ ప్రయాణికుల సంఖ్య చాలా వరకు తగ్గుతూ వస్తోంది. కేవలం టిక్కెట్ల చార్జీల రూపంలోనే రెండు డిపోలకు దాదాపుగా నిత్యం రూ.38లక్షల నుంచి రూ.40 ల వరకు సమకూరుతుందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే తాజాగా ప్రయాణికుల రద్దీ తగ్గటంతో చార్జీల రూపంలో వచ్చే ఆదాయం కూడా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు తగ్గిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు పండుగలు, శుభకార్యాలు కూడా పెద్దగా లేకపోవడం, విద్యా సంస్థలు ప్రారంభమవడం కూడా ఒక కారణంగా విశ్లేషిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో బస్టాండ్‌లో వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. రానున్నది శ్రావణ మాసంతో పాటు శుభకార్యాలు కూడా పెద్ద ఎత్తున జరుగనున్న నేపథ్యంలో మున్ముందు ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

జీడీసీసీ బ్యాంకు సీఈఓగా అజయ్ కిషోర్



గుంటూరు సిటీ, జూన్ 30 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (జీడీసీసీ) సీఈఓ నియామకంపై ఏర్పడిన ప్రతిష్టంభనకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. జీడీసీసీ బ్యాంకు కొత్త సీఈఓగా సీహెచ్ అజయ్ కిషోర్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఈఓకు సహకార శాఖ రాష్ట్ర ఉద్యోగుల సంఘం నేత మొవ్వా వెంకటేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కోనో కార్పస్‌ను కాపాడుకుందాం

● పర్యావరణ వేత్త ప్రొఫెసర్ బయ్యపు రెడ్డి



మాట్లాడుతున్న పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపు రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కోనోకార్పస్ (దుబాయ్) మొక్కలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ఈ చెట్టు అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తుందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి పేర్కొన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో కోనో కార్పస్ మొక్కలను రక్షించుకుందాం అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రపంచంలో 80 దేశాలకు పైగా విస్తరించిన కోనోకార్పస్ కార్బన్ డైయాక్సైడ్‌ను తీసుకుని అత్యధికంగా ఆక్సిజన్ అందిస్తూ వాయు కాలుష్యాన్ని, ధ్వని కాలుష్యాన్ని నివారించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ మొక్క ఎలాంటి నిర్వహణ వ్యయం లేకుండా వేగంగా పెరుగుతూ పచ్చదనాన్ని అందిస్తూ, పర్యావరణ హితంగా కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. కోనోకార్పస్ పుప్పొడి ద్వారా అలర్జీ సమస్యలు వస్తాయనే ప్రచారం అపోహలు తప్ప ఎక్కడ ఆధారాలు లేవన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. మాఫియా తమ దోపిడీకి అడ్డంగా ఉన్నాయని కోనో కార్పస్‌పై అర్థ రహిత ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఏళ్ళ రత్తయ్య, జీవశాస్త్ర నిపుణులు జి.గోపాలకృష్ణ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, టి.ధనుంజయ రెడ్డి, కొరివి వినయ్ కుమార్, ఓరుగంటి నారాయణ రెడ్డి, అవధానుల హరి, అల్లాబక్షు, మానవత నేతలు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కోసం గత 35 ఏళ్లుగా తనతో పాటు కలసి తిరిగి.. పార్టీ అధికారంలోకి రావడానికి పని చేసిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం రామాపురం గ్రామానికి చెందిన ఆకూరి వెంకటరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. కర్మక్రియల రోజున మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సిమెంట్ యాజమాన్యం ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతుడు ఆకూరి వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ మృతుడు ఆకూరి వెంకటరెడ్డి క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని పేర్కొన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు, వేముల వినోద్‌రెడ్డి, బద్రి, తంగెళ్ళ శ్రీను, పగడాల భాస్కరరావు, నెల్లూరి రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శికి జైలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో నిందితుడైన చీకటీగలపాలెం గ్రామ కార్యదర్శి కనుగంటి మహేంద్రకు కోర్టు జైలు శిక్ష విధించింది. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. గుంటూరు నగరంలోని చైతన్యపురి కాలనీలో నివాసం ఉంటున్న.. ప్రత్తిపాడు మండల పరిధిలోని పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి నాగిరెడ్డి తన చిన్నమ్మ మరణానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం కోసం.. ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ మండలం చీకటీగలపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీకి 2010లో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ సర్టిఫికెట్ ఇవ్వడానికి .. అప్పటి గ్రామ ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న కనుగంటి మహేంద్ర రూ.8లక్షలు లంచంగా సదరు అన్నపురెడ్డి నాగిరెడ్డిని డిమాండు చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సదరు ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ బాధితుని నుంచి 2010 జూలై 12న లంచం డబ్బులను తీసుకొంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేశారు. విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో అతనిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తదనంతరం సదరు కోర్టు కేసు విచారణ అనంతరం అప్పటి సెక్రటరీ కనుగంటి మహేంద్రకు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానాగా విధిస్తూ సోమవారం కోర్టు తీర్పునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగుతుంటే.. దానిని గురించి ఎవరైనా సంబంధిత జిల్లా ఏసీబీ అధికారులకు కాని లేదా ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064కు గాని లేదా మొబైల్ నంబరుకు 94404 40057 కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

గ్రేడ్ -5 కార్యదర్శులకు కౌన్సెలింగ్


గ్రేడ్ -5 కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓలు నాగసాయి కుమార్, ప్రభాకర్‌రావు, నాగేశ్వర్ నాయక్

గుంటూరు సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల కు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు 154 మంది ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్ తెలిపారు. మరో 62 మంది రిక్వెస్ట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికీ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. బాపట్ల, పల్నాడు డీపీఓ లు కె.ఎల్.ప్రభాకర్ రావు, నాగేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

రైల్వే సవరించిన టిక్కెట్ చార్జీలు నేటి నుంచి అమలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సబర్బన్, నాన్ సబర్బన్ రైళ్లలో మంగళవారం నుంచి రైల్వేబోర్డు సవరించిన టిక్కెట్ చార్జీలు అమలులోకి రానున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే అమలులోకి వచ్చాయి. సబర్బన్(సింగిల్ జర్నీ ఫేర్)లో ఎలాంటి మార్పు చేయలేదు. సీజన్ టిక్కెట్స్(సబర్బన్, నాన్ సబర్బన్) రైళ్లలోనూ ఎలాంటి పెంపుదల చేయలేదు. ఆర్డినరీ నాన్-ఏసీ(నాన్-సబర్బన్) రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ టిక్కెట్ చార్జీలలో 500 కిలోమీటర్ల వరకు ఎలాంటి పెంపుదల లేదు. 501 నుంచి 1,500 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి రూ.5, 2,500 కిలోమీటర్ వరకు రూ.10, 3 వేల కిలోమీటర్ దూరం అయితే రూ. 15 చార్జీ పెరిగింది. స్లీపర్ క్లాస్ ఆర్డినరీలో కిలోమీటర్‌కు అర పైసా, ఫస్టు క్లాస్ ఆర్డినరీలోనూ అర పైసా పెంపుదల చేసింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్(నాన్-ఏసీ) సెకండ్ క్లాస్, స్లీపర్, ఫస్టు క్లాస్‌లో కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెంచింది. ఏసీ తరగతుల్లో ఏసీ చైర్‌కార్, ఏసీ 3 టైర్/3ఎకానమి, ఏసీ టూటైర్, ఏసీ ఫస్టుక్లాస్/ఎగ్జిక్యూటివ్ క్లాస్/ఈఏకు రూ.2 పైసలు చొప్పున పెంచింది. గుంటూరు - విజయవాడ- తెనాలి, తెనాలి - రేపల్లె మధ్య న రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైళ్ల టిక్కెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్‌కు కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెంచడం వల్ల సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లలో చార్జీ రూ.5 వరకు పెరగొచ్చు. ఏసీ తరగతులయితే రూ.10 వరకు పెరగొచ్చు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	96, 104, 115
చికెన్ విత్ స్కిన్(కిలో)	184.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	194.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



నాయీ బ్రాహ్మణ కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టడానికి ఏఈల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రాధాన్య క్రమంలో చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ నాయీ బ్రాహ్మణకాలనీ, తుఫాన్ నగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా తమ పరిధిలో ముఖ్యమైన మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ఎస్వీఎస్ ప్రసాద్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

టైగర్ దోమలతోనే డెంగీ జ్వరాల వ్యాప్తి

● డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టైగర్ దోమల ద్వారా డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని, వీటి నియంత్రణకు సమష్టిగా కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కే.విజయలక్ష్మి కోరారు. జాతీయ డెంగీ మాసోత్సవాలు పురస్కరించుకొని డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో ప్రోగ్రామ్ ఆఫీసర్లకు, మలేరియా సిబ్బందికి సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆమె ప్రసంగించారు. జిల్లావ్యాప్తంగా జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు డెంగీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉన్నప్పుడే దోమలు వృద్ధి చెందుతాయని ఆమె వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఈ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డిప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ నరేంద్రబాబు, ఆరోగ్య విస్తరణాధికారి శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

జేఎల్ఎం గ్రేడ్ 2ల సమస్యలను పరిష్కరించాలి

● విద్యుత్ శాఖ మంత్రికి విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): జేఎల్ఎం గ్రేడ్ 2ల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులను విద్యుత్ సంస్థ లో విలీనం చేయాలని కోరారు. ఉద్యోగులు ప్రమాదాల బారిన పడితే సరైన వైద్యం అందడం లేదని వాపోయారు. వైద్య ఖర్చులను భరిం చలేక జేఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెంచల ప్రసాదు, నాయుబ్ రసూల్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

చిరస్మరణీయుడు ముళ్ళపూడి వెంకటరమణ

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ వనంలో ఎన్నో సజీవ పాత్రలు సృష్టించి, చెరగని ముద్రగా నిలిచిన ముళ్ళపూడి వెంకటరమణ తెలుగువారి మదిలో చిరస్మరణీయుడేనని డాక్టర్ వీవీ రామ్‌కుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ హాస్య రచయిత ముళ్ళపూడి వెంకటరమణ జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సున్నిత హాస్యం, సునిశిత వ్యంగ్యం ముళ్ళపూడి సొంతమని, ఆయన గొప్ప హాస్యా కథా రచయిత, విమర్శకుడు, వ్యాసకర్తగా ఆయన సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ కార్య దర్శి కొండా శివరామిరెడ్డి, గుప్తా, మూర్తి, రాజశేఖర్ తదితరులున్నారు.

గుళ్ళపల్లి సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలకు పైగా ఆధ్యాత్మిక, విద్యా సంస్థలకు, దేవాలయాలకు, కళా సాంస్కృతిక రంగాలకు భారీ విరాళాలు అందిస్తూ విశేషమైన సామాజిక సేవలు అందిస్తున్న గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై సోమవారం సేవాసంస్థ వారి వార్షికోత్సవాలు ఘనం గా జరిగాయి. కార్యక్రమాన్ని పాలకమండలి కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాజా వెంకట సుబ్రహ్మణ్యం శిష్య బృందం జానపద, జావళి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం గుళ్లపల్లి సుబ్బారావును, కళాకారులను ఘనంగా సత్కరించారు.

టీచర్ ఉద్యోగం రాదని మనస్థాపంతో యువతి ఆత్మహత్య

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వర్ణభారత్‌నగర్‌కి చెందిన దేవళ్ల చంద్రిక (25) అనే యువతి టీచర్ ఉద్యోగం రాదనే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వర్ణభారతినగర్‌కు చెందిన ప్రసాద్, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె చంద్రిక టీటీసీ పూర్తి చేసింది. జూన్ 18న జరిగిన డీఎస్సీ పరీక్ష రాసింది. 24న విడుదలైన 'కీ చూసుకుంది. అందులో మార్కులు తక్కువ రావడంతో తనకు ఉద్యోగం రాదేమోనని తీవ్ర మనస్థాపానికి గురైంది. దీంతో 24న రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను వెంటనే జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం కన్నుమూసింది. తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసైన మాజీ ఉద్యోగి...

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ ఆరో లైన్‌కి చెంది న మాజీ ఉద్యోగీ చింతా నాగేశ్వరరావు(48) ఇంట్లో ఫ్యాన్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనగర్‌కి చెందిన చింత నాగేశ్వరరావు గతంలో కలెక్టరేట్లోని ఆర్అండ్‌బీ శాఖలో పనిచేసి మద్యానికి బానిసై అర్థాంతరంగా ఉద్యో గం మానేశాడు. ఇటీవల నాగేశ్వరరావుపై ఒక కేసు నమోదు కాగా ఆయనను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఆ కేసులో ఈ నెల 3న బెయిల్‌పై బయటకు వచ్చాడు. అప్పటి నుంచి మరింత మనస్థాపానికి గురై తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటున్నాడు. ఇదిలా ఉంటే ఆదివారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న భాగ్యలక్ష్మి సోదరుడు ఇంటికి వచ్చి ఇద్దరికి సర్దిచెప్పి వెళ్లాడు. ఆ తర్వాత భాగ్యలక్ష్మి పిల్లలను తీసుకొని సోదరుడు ఇంటికి వెళ్ళింది. తిరిగి సోమవారం ఉదయం వచ్చి చూడగా తలుపులు లోపల గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయ లేదు. తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్ ఉరి వేసుకుని వేలా డుతూ కనిపించాడు. భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను పైస్థాయి అధికారులే పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 260 అర్జీలు

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను కింద స్థాయి సిబ్బందే పరిష్కరిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 260 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ తేజ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటి కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌తో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైఅధికారుల స్థాయిలో అర్జీని పరిష్కరించాలన్నారు. కింద స్థాయి సిబ్బంది విధులు నిర్వహించడంతో అర్జీ సరిగ్గా స్కాన్ చేయకుండానే అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. దీంతో పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో సంతృప్తి స్థాయి తక్కువగా ఉందని, దీనిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. జేసీ భార్గవ తేజ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్, కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్ దాఖలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జిల్లా అధికారి శైలజ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గాబాయి, డీటీసీ సీతారామి రెడ్డి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాదు, జిల్లా పరిశ్ర మల శాఖ జీఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.5 లక్షలు డబ్బులు తీసుకుని మోసం చేశాడని స్థానిక భారతీపేటకు చెందిన మక్కెన భవాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, మా బంధువుకు జిల్లా కోర్టులో అటెండర్ ఉద్యో గం ఇప్పిస్తామని చెప్పి మా వద్ద పండిత్ నాగార్జున అనే వ్యక్తి మా వద్ద డబ్బులు తీసుకున్నారని తెలిపారు. విధులు నిర్వహించేందుకు వెళ్లగా అక్కడ సిబ్బంది మమ్మల్ని వెనక్కి పంపారని వివరించారు.

● మూడో దశలో కరోనా సోకిన వ్యక్తుల శాంపిల్స్‌ను గుంటూరు మెడికల్ కళాశాల తీసుకుచ్చేందుకు ఏర్పాటు చేసిన వాహనాల బిల్లులు ఇప్పటి వరకు మంజూరు చేయలేదని పెదకాకాని మండలం, అదే గ్రామానికి చెందిన చెన్నం రామకృష్ణ, అనిశెట్టి విజయకుమార్, నవీన్ కుమార్, గండు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ తదితరులు

శ్రీనులు అర్జీ అందజేశారు.

● రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని పంచాయతీరాజ్ విభాగంలో వైసీపీ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు జమ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల జీతాన్ని విడుదల చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు, సర్పంచులు తదితరులు ఉన్నారు.

● సెయింట్ మేరీస్ కళాశాల నుంచి వచ్చే మురుగునీరు, వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నారాకోడూరు గ్రామానికి చెందిన రైతులు అర్జీ అందజేశారు. రైతులు నడిచే డొంక దారిలోకి, పంట భూములోకి ఈ నీటిని పంపుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చా రు. దీనిపై గతంలో ఏప్రిల్ 4న అర్జీ అందజేశామని, దీనిపై కళాశాల యజమాన్యం మాకు హైకోర్టు ద్వారా నోటీసులు పంపారని తెలిపారు. కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

● విద్యుత్ శాఖకు మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ బకాయి పడ్డ రూ.42 కోట్లను వసూలు చేయాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని అర్జీ అందజేశారు. రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కుంభకోణంలో అధికారుల పాత్రపై విచారణ జరిపించి, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల ఆవరణలో వసతి గృహాన్ని నిర్మించాలి

● కలెక్టరేట్ ఎదుట స్టాల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో నే వసతిగృహాన్ని నిర్మించాలని స్థానిక నగరంపాలెం, సోమవారం స్టాల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు గుంటూరు, కలెక్టరేట్ ఎదుట నిర సన చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 150 మందికి పైగా వసతి గృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వేసవి సెలవు ల సమయంలో మరమ్మతుల పేరుతో పైకప్పు, ఇతర గోడలను తొలగించారని పేర్కొన్నారు. దీంతో వసతి గృహం లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. కలెక్టర్ స్పందించి హైస్కూల్ ఆవరణలోనే వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వారు వినతిపత్రం అందజేశారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులను విద్యాశాఖలో డీవైఈవోగా పని చేస్తున్న రత్నం అనే ఉద్యోగి మీడియా సమక్షంలోనే బెదిరింపులకు దిగారు. ఏమైనా ఉంటే నేరుగా మాకు చెప్పాలి గాని నిరసనలకు దిగి తే పరిష్కారమవుతుందా అంటూ ప్రశ్నించారు. నిరసనలు ఎన్ని రోజు లు చేస్తారో మేము కూడా చూస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుంటూరులో భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకొని గుంటూరులో భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు అమరావతి ఉత్సవ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. 79 నుంచి 100 అడుగుల మధ్య విగ్రహాన్ని తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు. స్థానిక ఇన్నర్ రింగురోడ్డులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో గోడ ప్రతులను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఇన్నర్‌రింగు రోడ్డు, విజయ డిజిటల్ షోరూం వద్ద ఉన్న మైదానంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. స్వచ్ఛమైన నల్ల మట్టి, ఎర్రమట్టితో పాటు హాని కలిగించని రంగులతో ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ హోమాలు, పూజలు నిర్వహించి పండుగ రోజైన ఆగస్టు 27న విగ్రహాన్ని ప్రతిష్ఠ చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రిని ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు రాజేష్, లక్ష్మీనారాయణరెడ్డి, గంటా స్వామి, కార్పొరేటర్ బాలాజీ పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్రంలో రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి మన్నూరు భాస్కరయ్య కోరారు. పాత గుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయ న ప్రసంగించారు. సామాజిక చట్టంతో రజకులపై దాడులను ఆరికట్ట వచ్చని అన్నారు. రజకుల సంక్షేమ కార్పొరేషన్‌కు విధి, విధానాలు రూపొందించి రాష్ట్ర బడ్జెట్లో నిధులను కేటాయించాలని కోరారు. సమావేశంలో వల్లభాపురం వెంకటేశ్వరరావు, మండూరు వెంకట నరసయ్య, పాగోలు శ్రీనివాసరావు, పణితపు కోటే శ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో రెండు రోజులగా జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. పలు విభాగాల్లో బంగారు పతకాలు కైవసం చేసుకుని 5 నుంచి మహారాష్ట్ర, నాసిక్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఆశోక్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

అండర్-10, ఇప్పి విభాగంలో బీ దీక్షిత రాథోడ్, జీ తన్మయిశ్రీ, ఎం స్నేహశ్రీ, సీబార్ విభాగంలో సీ ఆరోహి, ఫాయిల్ విభాగంలో రిశాంక్ శర్వాన్, పీ రిత్విక్, అండర్-12, ఇప్పి విభాగంలో డీ జోష్నిక, శ్రీలక్ష్మి, యాశ్వేత, ఫాయిల్ విభాగంలో ఎం.శ్లోక, ఆర్షియా హస్నా, సీబార్ విభాగంలో హన్సిత, నాగశ్రీ, చైతన్య సాయి, పృథ్వీ వినయ్ ఉన్నారు.

ఐ అండ్ పీఆర్ డీడీ రఫీక్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడిగా ఏడేళ్లకు పైగా పని చేసిన అబ్దుల్ రఫీక్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ఆ శాఖ అధికారులు అన్నారు. సోమవారం డీడీ రఫీక్ ఉద్యోగ విరమణ సందర్భంగా బ్రాడీపేటలోని ఐ అండ్ పీఆర్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజనల్ పీఆర్‌వో జే శ్యామ్‌కుమార్, ఏఈఈలు కిషోర్, మస్తాన్, పీఆర్వో వై వెంకటేశ్వర్లు, ఏపీఎస్ కృష్ణయ్య, సీనియర్ సహాయకుడు డీ సురేష్, టైపిస్టులు సీహెచ్ శివరామకృష్ణ, బుజ్జి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక గుంటూరు జిల్లా కార్యవర్గం ఎన్నిక సోమవారం నల్లచెరువులోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బొంతు వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీగా వక్కలగడ్డ వెంకటేశ్వరరావు, ట్రెజ రర్‌గా సాయిరామ్, గౌరవాధ్యక్షుడుగా రాజా సిద్దార్థలతో పాటు సలహాదారులను కూడా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశంలో జూలై 12, 13వ తేదీల్లో కడపలో జరగనున్న రాష్ట్ర మహాసభలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు.

గత కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నయ్యనని మోసం

● ఉద్యోగం ఇప్పిస్తానని ఐదున్నర లక్షలతో చీటింగ్

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంతకుముందు గుంటూరు కలెక్టర్‌గా పని చేసిన వేణుగోపాల్‌రెడ్డి తన తమ్ముడు అని చెప్పి ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన భీమవరపు రమేష్‌రెడ్డికి జిల్లా పరిషత్‌లో పునుగోటి కృష్ణారెడ్డి పరిచయమయ్యాడు. ఇంతకుముందు కలెక్టర్‌గా పనిచేసిన వేణుగోపాల్‌రెడ్డి తన తమ్ముడేనని ప్రస్తుతం ఆయన మహిళా శిశు సంక్షేమశాఖలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారని, మహిళా శిశు సంక్షేమ శాఖలో మీ అబ్బాయికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద ఈనెల 3వ తేదీన 5లక్షల 50 వేలు డబ్బులు తీసుకున్నాడన్నారు. తర్వాత ఈనెల 11న మహిళా స్త్రీశిశు సంక్షేమశాఖ నుంచి తన కుమారుడికి ఉద్యోగం వచ్చినట్లు ఈమెయిల్ పంపి మరో ఐదు లక్షలు డిమాండ్ చేశారన్నారు. దీంతో అనుమానం వచ్చి తాము మెయిల్‌ను చెక్ చేయిస్తే అది నకిలీ ఈమెయిల్ అని తేలిందన్నారు. మోసం చేసిన కృష్ణారెడ్డిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు భీమవరపు రమేష్‌రెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నాడు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నాలుగు లక్షలు తీసుకొని..

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పడితి నాగార్జున ఇద్దరి వద్ద నాలుగు లక్షలు తీసుకొని మోసం చేశాడు. దీంతో సోమవారం బాధితులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో టీచరుగా పనిచేసే మక్కెన భవాని, అదేవిధంగా ఆమె మరిదికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కలెక్టరేట్లో అటెండర్‌గా పని చేసే జంగిలి రవికుమార్ ద్వారా పడితి నాగార్జున 4 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత నుంచి ఫోన్ కూడా తీయడం లేదన్నారు. ఇంటి అడ్రస్ కనుక్కొని వెళ్తే నాగార్జున ఇంట్లో లేడని, ఆయన తండ్రి నాగార్జునతో మాట్లాడి డబ్బులు ఇప్పిస్తానని చెప్పాడన్నారు. ఆ తర్వాత నుంచి ఆయన కూడా స్పందించడం లేదన్నారు. తమను నమ్మించి మోసం చేసిన నాగార్జునపై చట్టప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదులో వేడుకుంది.

ఫోక్సో కేసులో రాజీపడాలంటూ యువకుడి వేధింపులు

గతంలో తనపై పట్టాభిపురం స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో రాజీ పడాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్న గుజ్జనగుండ్లకు చెందిన నిందితుడు పసుపులేటి శ్రీపతిపై నగరంపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. గతంలో ఆ బాలిక గుజ్జనగుండ్లలో ఉన్నప్పుడు శ్రీపతి ఆమెను ప్రేమ పేరుతో వెంటపడి లొంగదీసుకున్నాడు. ఆ తరువాత పెళ్ళికి నిరాకరించడంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసారు. అప్పటి నుంచి బాలిక కుటుంబం శ్రీనివాసరావుతోటలో ఉంటోంది. అయితే కొంత కాలంగా నిందితుడు శ్రీపతి ఆ కేసులో రాజీ పడాలంటూ బాలికను వేధిస్తున్నాడు. దీంతో ఆమె ఎస్పీని ఆశ్రయించింది. ఎస్పీ ఆదేశాలతో నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏలూరు బజారు, పట్నం బజారు, సంపత్‌నగర్, నల్లచెరువు, మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ బీ రాజమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలానే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవా రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షి దయా నందనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ12 ఆపరేషన్ ఏఈ ఉద య్‌కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సాయిబాబా ఉద్యోగ వీడ్కోలు సభ

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించి బెల్లంకొండ సాయిబాబా అందరి ప్రశంసలు అందుకున్నారని గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మెడికల్ కాలేజ్ ఎదురుగా గల ఎన్జీవో రిక్రియేషన్ హాల్లో దుగ్గిరాల తాలూకా ఎన్జీవో అధ్యక్షుడు సాయిబాబు పదవీ విరమణ వీడ్కోలు సన్మాన సభ జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నేహా, రిటైర్డ్ జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తొలి ఏడాదిలోనే 700 సంక్షేమ పథకాల అమలు

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్



దేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా దివాళా తీసివున్న పరిస్థితుల్లో అధికారం చేపట్టిన చంద్రబాబు తన అనుభవం, పలుకుబడి, కఠోర దీక్షతో తొలి ఏడాదిలోనే 700లకు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరులోని టీడీపీ నగర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి దిశగా కూటమి అడుగులు వేస్తోందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి రెండింటినీ సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలను కూటమి ప్రభుత్వం పొందిందన్నారు. తొలి ఏడాదిలోని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 70% అమలు చేసి చూపించామన్నారు. కూటమి చేస్తున్న మంచిని, చెడుగా చూపించడమే పనిగా వైసీపీ పెట్టుకుందని మండిపడ్డారు. ఎన్డీఏ పథకాలతో పేదల జీవితాలు మారుతున్నాయని గ్రహించి వాటిపై దుష్ప్రచారం చేయడమే అజెండాగా వైసీపీ పని చేస్తోందన్నారు. గంజాయి, బెట్టింగ్, రౌడీషీటర్లకు అండ కాస్తూ రాజకీయ ముసుగులో నేరాలను ప్రేరేపిస్తోందన్నారు. విధ్వంసం, ప్రతీకారానికి మారుపేరుగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయాడన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ వంశీకృష్ణ

గుంటూరు, జూన్ 30 (ఆంధ్ర జ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ నాణ్య మైన విద్యను అందించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ విద్యావంతులుగా మారి తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తల్లికి వందనంలో భాగంగా 67 లక్షల మంది విద్యార్థులకు రూ.13 వేలు చొప్పున అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కూటమి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి యువ తపోరు పేరుతో కార్యక్రమం నిర్వహించి యువత కు గంజాయి, మందు, డబ్బులు పంచి వారి భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్నాడన్నారు. విద్యార్థులను అడ్డం పెట్టుకొని నెల్లూరులో జగన్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించాలనుకుంటు న్నాడని, విద్యార్థులు, తల్లితండ్రులు విజ్ఞతతో ఆలోచించి ఆయన కార్యక్రమాలకు విద్యా ర్థుల ప్రాణాలను పణంగా పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. సమా వేశంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంచకర్ల ధర్మతేజ, టీఎస్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పినపాటి జీవన్, గుంటూరు తూర్పు టీఎన్ఎస్ఎఫ్ అధ్య క్షుడు ఏలూరి నరేంద్ర, పచ్చల నివాస్, విష్ణు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు (విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్పొరేట్ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో 13 మంది కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, కే.సురేష్‌బాబు, కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి విభాగాధిపతి కే.రమేష్‌చంద్ర తదితరులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల వేతనాలను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): పకృతి వ్యవసాయ ఉద్యోగుల పెండిగ్ వేతనాలను విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవ సాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆర్‌వైఎస్ఎస్ సీఈవో రామారావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వరప్రసాద్ సునీల్, నాగేశ్వరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి కారుణ్య నియామకాలకు సంబంధించి ఎక్సైజ్ శాఖ, కాలేజీ ఎడ్యుకేషన్, ట్రెజరీలల్లో మొత్తం ముగ్గురిని జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ జారీ చేసిన నియామక ఉత్తర్వులను అందించారు. కార్యక్రమంలో జేసీ భార్గవ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.



ఏరియా వైద్యశాలలో గర్భిణిని పరీక్షిస్తున్న గైనకాలజిస్టు బీ అరుణ

రోగుల కృతజ్ఞతే సంతృప్తి

- ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం డాక్టర్
- రోగికి, వైద్యులకు ప్రత్యేకమైన అనుబంధం
- వైద్య వృత్తిపై మక్కువతో వైద్యుల సేవలు..
- నేడు వరల్డ్ డాక్టర్స్ డే..

సత్తెనపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన గమ్యంలో ఎన్ని రంగాలను ఎంచుకున్నా.. అన్నింటిలోకి భిన్నమైనది వైద్య వృత్తి. ఇదొక బాధ్యత. ధనం, పేరుప్రఖ్యాతలు కాదు.. తనను నమ్మి వచ్చిన రోగి ఆరోగ్యం మెరుగుపరిచి, ప్రాణం నిలబెట్టిన రోజు వారి కళ్లలో కనిపించే నిజమైన కృతజ్ఞతా భావం వైద్యులకు నిజమైన సంతృప్తిని స్తాయి. ప్రస్తుతం ధనమే పరమావధిగా అన్ని రంగాలు కొన్ని కళంకాలను అద్దుకుంటున్నా.. వైద్య వృత్తిని దైవ సమానంగానే భావిస్తారు. వైద్యో నారాయణ హరి అని ప్రాచీన సంస్కృత అనుబంధం. వైద్యులు అంటే ప్రజలకు ఒక నమ్మకం. విశ్వాసం. ప్రాణాలు పోసే దేవుడు. వైద్యుడు, రోగి మధ్య ఉన్న బలమైన బంధం ఉంటుంది. వైద్యుల సేవలను గుర్తించి, గౌరవించుకునేందుకు.. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా జూలై 1న డాక్టర్స్ డేని జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్ రెండవ ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ సుందర్‌రాయ్ జ్ఞాపకార్థం మనం వైద్యుల దినోత్సవం నిర్వహించుకుంటాం.

వైద్యులంటే ఒక నమ్మకం

తమ సొంత కుటుంబ సభ్యులకు సైతం వెల్లడించని రహస్య సమాచారాన్ని వైద్యులకు మాత్ర మే రోగులు చెపుతారు. తమ శరీరాన్ని పరీక్షించేం దుకు నిరభ్యంతరంగా అంగీకరిస్తారు. ఈ స్థాయి లో నమ్మకం, విశ్వాసాన్ని పొందటమనేది మరియే ఇతర వృత్తిలో ఉండదు. ప్రజల నుంచి ఇంతగా విశ్వాసాన్ని పొందుతున్న వైద్యులు.. నమ్మకాన్ని కాపాడు కోవాలి. తమ విధుల పట్ల అంకిత భావాన్ని ప్రదర్శించాలి. కొన్ని సంవత్సరాలుగా పలు కారణాల వల్ల వైద్యులు, ఇటువంటి అద్వితీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకొనేందుకు వైద్యుల దినోత్సవం కన్నా మంచి తరుణం లేదు. ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్లు ఆంధ్రజ్యోతికి తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

తండ్రి కోరిక మేరకు..



తన తండ్రి జాన్ సైమన్ కోరిక మేరకు డాక్టర్‌ను అయ్యాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచి వైద్య రంగం అంటే చాలా మక్కువ ఏర్పడింది. గైనకాలజిస్టుగా.. 25 ఏళ్ల నుంచి రోగులకు సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ముఖ్యంగా గర్భిణులకు సేవలు అందించడం చాలా ఆనందంగా ఉంది.

-డాక్టర్ బి.అరుణ, గైనకాలజిస్టు

తల్లిదండ్రుల కృతజ్ఞతలతో సంతృప్తి



నా తండ్రి మోహన్‌రావు వైద్య ఆరోగ్య శాఖలో పని చేసేవారు. చిన్నప్పటి నుంచి డాక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ గురించి మాకు తెలియజేసేవారు. తండ్రి ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ పూర్తి చేసి.. చిన్న పిల్లల డాక్టర్‌ను అయ్యాను. పిల్లలకు వైద్య సేవలు అందించినప్పుడు వారి తల్లిదండ్రులు చూపే కృతజ్ఞతలు సంతోషంగా ఉంటాయి.

-డాక్టర్ లక్ష్మణరావు, చిన్న పిల్లల డాక్టర్

17 ఏళ్లుగా సేవలు



తండ్రి వాసుదేవరాజు రైతు. చిన్నప్పటి నుంచి నేను డాక్టర్ కావాలని చెబుతుండేవారు. ప్రపంచంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి... వైద్య వృత్తి అని చెప్పే వారు. ఆయన కోరిక మేరకు ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండీ జనరల్ పూర్తి చేశాను. 17 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో రోగులకు సేవలు అందించడం సంతోషంగా ఉంది.

- డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్

1.70 లక్షల కుటుంబాలకు.. ముందస్తు రేషన్

- ప్రభుత్వం కల్పించిన అవకాశం సద్వినియోగం
- క్యూలైన్ కష్టాలు తప్పాయని వృద్ధులు, దివ్యాంగుల సంతోషం
- ఈ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను తీసుకోవడంలో వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంచి ఫలితాన్ని ఇచ్చింది. జూలై నెలకు సంబంధించిన రేషన్ సరుకులను జూన్ 25 నుంచే తీసుకొనే వెసులుబాటుని ప్రభుత్వం కల్పించింది. ఐదు రోజులుగా మూడు జిల్లాల్లో చాలా మంది దీనిని సద్వినియోగం చేసుకున్నారు. సగటున ఒక్కో జిల్లాలో 55 వేల మందికి పైగా సరుకులను తీసుకెళ్లారు. దీంతో మంగళవారం అందరికి ప్రారంభం కానున్న రేషన్ సరుకుల పంపిణీలో వృద్ధులు, దివ్యాంగులకు కష్టాలు తప్పాయి. ఈ విధానం శాశ్వతంగా కొనసాగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గత నెల నుంచి రేషన్ పంపిణీ విధానాన్ని ప్రభుత్వం మార్చింది. అంతకుముందు వరకు వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థ ద్వారా సరుకుల పంపిణీ జరిగింది. అయితే ఈ విధానం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడింది. దీనికి తోడు ఎండీయూ ఆపరేటర్లు నేరుగా లబ్ధిదారులకు సరుకులకు బదులు నగదు ఇచ్చి వాటిని మాఫియాకి చేరుస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. తిరిగి రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేపట్టింది. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ సరుకులు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే డీలర్లకు వీలుకాక పోవడం, కొందరు ఎండీయూ ఆపరేటర్ల లాగానే.. ఈ-పోస్ యంత్రం తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకొని సరుకులకు బదులు నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈ నెల నుంచి దివ్యాంగులు, వృద్ధులకు ఐదు రోజుల ముందుగానే సరుకులు పంపిణీ చేసేలా పీడీఎస్ సిస్టంలో ప్రభుత్వం మార్పులు చేసింది. అందులో భాగంగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి కొన్ని రోజులు ముందుగానే సరుకులను డీలర్ల దుకాణాలకు చేర్చారు.

జూన్ 25 - 30 మధ్యన రేషన్ తీసుకొన్న వృద్ధులు, దివ్యాంగులు

జిల్లా పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం శాతం
పల్నాడు	79736	12.55
బాపట్ల	56311	11.81
గుంటూరు	44411	7.51

పల్నాడు జిల్లాలో అధికం..

ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని రాష్ట్రంలోనే ఎక్కువ సంఖ్యలో పల్నాడు జిల్లాలోని లబ్ధిదారులు వినియోగించుకొన్నారు. ఆ తర్వాత స్థానంలో బాపట్ల జిల్లా, 18వ స్థానంలో గుంటూరు జిల్లా ఉంది. షాపుల వద్దకు వెళ్లగలిగే స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు తమకు సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి నిమిషాల వ్యవధిలోనే సరుకులు తీసుకోగలిగారు. ఈ విధానం ఎంతో బావుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి క్యూలైన్లలో నిలుచోవాల్సిన అవసరం లేకుండా పోయిందంటున్నారు. కాగా ఇప్పటికే 10 శాతం పైగా సరుకులు తీసుకొన్నందున ఆ మేరకు మంగళవారం నుంచి లబ్ధిదారులందరికి ప్రారంభమయ్యే సరుకుల పంపిణీ సందర్భంగా కొంత మేరకు రద్దీ తగ్గుతుందన్న అభిప్రాయం డీలర్లు, పౌరసరఫరాల అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



వరద నీటి నిర్వహణ.. పర్యాటక ఆకర్షణ

(5వ పేజీ తరువాయి)

నిర్వహణలో ఈ రిజర్వాయర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. కాగా శాఖమూరు రిజర్వాయర్‌ను కేవలం రిజర్వాయర్‌గానే కాకుండా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ ప్రయత్నిస్తోంది. ఫ్లవర్ గార్డెన్, క్రాఫ్ట్ బజార్, అమ్యూజ్‌మెంట్ పార్కు, మ్యూజికల్ ఫౌంటేన్, లేజర్ షో ఏర్పాటు చేయడంతోపాటు, రిజర్వాయర్లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దాంతోపాటు వాకింగ్ ట్రాక్, యోగా, మెడిటేషన్ హాళ్లను కూడా ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది.

● పూర్తయిన పూడిక తీత

50 ఎకరాల్లో నిర్మిస్తున్న శాఖమూరు రిజర్వాయర్ పూడిక తీత పనులు నూరుశాతం పూర్తయ్యాయి. వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా మట్టితో ఆనకట్టలు కట్టి అడ్డుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో స్వల్పంగా నీరు చేరింది. ఆ నీటిని మోటార్లతో తోడుతూ పనులు కొనసాగిస్తున్నారు. రిజర్వాయర్‌కు ఫస్ట్ లెవెల్ కాంక్రీట్ ఫౌండేషన్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. తొలి దశ ఫౌండేషన్ పనుల్లో భాగంగా వాటర్ ప్రూఫ్ షీటు అమర్చి, దాని మీద గ్యాబిన్ మెస్ ఏర్పాటు చేసి దాంట్లో రాళ్లు నింపి ఫౌండేషన్ లేయర్‌ను రూపొందించారు. ఈ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ వారంలో అది కూడా పూర్తవుతుందని నిర్మాణ సంస్థ చెబుతోం ది. కాగా పార్కు చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి.

ఆగంతకులకు రాచమార్గం

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం వేకువజామునకు ముందు పిడుగురాళ్ల, తుమ్మలచెరువు మధ్యన విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి జరిగిన ప్రయత్నంలో పోలీసులు జరిపిన కాల్పుల ఉదంతం.. రైల్వేలో భద్రతపై మళ్లీ అనుమానాలను రేకెత్తిస్తోంది.

ఈఎఫ్‌టీలో నిబంధనకు నీళ్లు..

బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి యువకులు పనుల కోసం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. వీళ్లంతా ఎక్కువగా విశాఖ, ఫలక్‌నూమా, అమరావతి, ప్రశాంతి, సిల్చార్, ఎల్‌టీటీ, భావనగర్, నాగర్‌సోల్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రిజర్వేషన్ చేసుకొంటే వాళ్ల వివరా లన్నీ రైల్వే డేటాలో రికార్డు అవుతాయి. దాంతో ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే జనరల్ టిక్కెట్ తీసుకొని స్లీపర్, ఏసీ త్రీటైర్‌లో ఎక్కేస్తుంటారు. భోగీల్లో ఖాళీలు లేకపోతే టీటీఈలు వీళ్లని తదుపరి రైల్వేస్టేషన్‌లో దింపేయాలి. ఒకవేళ ఖాళీలు ఉంటే ఈఎఫ్‌టీ రాసి అందులో ప్రయాణికుల పేర్లు, మొబైల్ నంబర్లు నమోదు చేయాలి. దాని వల్ల ఐడెంటిటీ అనేది పక్కాగా అందుబాటులో ఉంటుంది. అయితే టీటీఈలు ఈ పని చేయడం లేదు. బెర్తులు ఖాళీలు లేకపోయినా ఈఎఫ్‌టీ రాస్తున్నారు. అందులోనూ వివరాలు సరిగా నమోదు చేయడం లేదు. దీని వల్ల రైళ్లలో ఏదైనా నేరం జరిగినా నేరస్తులను గుర్తించడం కష్టతరమవుతోంది.

ఆగంతకులకు ఆహ్వానం..

ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు టిక్కెట్ కలెక్టర్లు కొన్ని ప్రధానమైన స్టేషన్లలో రైళ్ల బోగీల వద్ద బయట ఉండి ఈఎఫ్‌టీలు రాసి లోపలికి అనుమతి స్తున్నారు. పైన పేర్కొన్న ఏ రైలు గుంటూరు వచ్చినా స్లీపర్ క్లాస్‌లో కాలు పెట్టడా నికి కూడా ఖాళీ ఉండదు. చాలా మంది జనరల్ టిక్కెట్లతో.. ఫుట్ బోర్డు, టాయ్‌లె ట్స్ వద్ద కూర్చుని ఉంటారు. గతంలో ఏసీ త్రీటైర్‌లో కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్ర యాణి కులనే అనుమతించే వారు. ఇప్పుడు వాటిల్లోనూ ఈ ఆగంతకులను అనుమ తిస్తుం డటంతో భద్రత ప్రశ్నార్థకమైంది. సికింద్రాబాద్ వెళ్లే రైళ్లన్నీ అర్ధరాత్రి వేళ సత్తెన పల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లకు చేరుకొంటుంటాయి. ఆ సమయంలోనే ప్రయాణికులు కాస్తంత కునుకు తీస్తుంటారు. అప్పుడు దోపిడీ దొంగలు నిర్మానుష్య ప్రదేశంలో చైన్ లాగి.. రైలుని ఆపి దోచుకోవడానికి ప్రయత్ని స్తున్నారు. సకాలంలో ఆర్‌పీఎఫ్ గార్డులు స్పందిస్తే సరి.. లేకుంటే ప్రయాణికుల సొ త్తుని భారీగా దోచుకొంటున్నారు. ఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోతే ప్రయాణికుల ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కు మార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 754 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,625, గరిష్ఠధర రూ.10,350, మోడల్‌ధర రూ.10,200 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,625, గరిష్ఠధర రూ.10,400, మోడల్‌ధర రూ.10,175 పలికాయి.

నేడు లోకేశ్ ప్రజాదర్బార్

తాడేపల్లి(ఉండవల్లి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉండవల్లి నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. ఉదయం 6 నుండి 7 గంటల వరకు జరిగే ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన అందుబాటులో ఉంటారని టీడీపీ శ్రేణులు తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల లోపు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పలు కంపెనీలకు సమ్మె నోటీసులు

తాడేపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గానికి వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో జరగనున్న సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరుతూ సీపీఎం నేతలు, పలువురు కార్మికులు ఆయా కంపెనీల వారికి సమ్మె నోటీసును సోమవారం అందజేశారు. 9న కార్మికులు ఎవరూ విధులకు హాజరు కారాదని కోరారు. తాడేపల్లిలోని టీటీ రైల్వే యార్డు, చేపల గ్రేడింగ్ కంపెనీ, మందుల తయారీ కంపెనీ, ఐవోసీ, హెచ్‌పీసీఎల్, గౌతం ఫుడ్స్ కంపెనీలకు సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసులు అందజేసి ఆయా కంపెనీల మేనేజ్‌మెంట్‌లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నుదురుపాడులో డీ వార్మింగ్

ఫిరంగిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుదురుపాడు పశు వైద్యాధికారి షేక్ పీర్ అహమ్మద్ 250 గొర్రెలు, 50 మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులను సోమవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందును తాగించడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరసనకు తరలిరావాలి

పెదనందిపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకై తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘ నాయకులు పిలుపునిచ్చారు. పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని ఆయా గ్రామాల్లో సోమవారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. పొగాకు రైతులు సమస్యలు పరిష్కారం కోసం రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామని పెద్దసంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రతి ఎకరాకు నీరందించడమే కూటమి లక్ష్యం



అప్పాపురం చానల్‌లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కాకుమాను, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ నువ్వుల సునీల్ చౌదరి అన్నారు. మండలపరిధిలో అప్పాపురం చానల్‌లో పూడికతీత పనులను సోమవారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. అప్పాపురం చానల్‌లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు చేయడం వల్ల నీరు ఇబ్బందులు లేకుండా దిగువ పొలాలకు నీరు చేరుతుందన్నారు. రైతులకు కష్టాలు దూరం చేయడమే లక్ష్యమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, నల్లమోతు పూర్ణచంద్రరావు, పెద్ది రవీంద్రబాబు, స్థానిర రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ 17 లక్షలతో మోసం

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయుష్మాన్ భారత్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి తమ నుంచి 17 లక్షల తీసుకొని మోసం చేశాడని తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమకు క్లోస్మేట్ అయిన కడప జిల్లా బద్వేలు ప్రాంత పరిధిలోని ఎగువ నేలటూరుకి చెందిన బోయపాటి విశ్వనాథ్ ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించిన నేషనల్ హెల్త్ అథారిటీ సంస్థలో డేటా వెరిఫికేషన్ ఆఫీసర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ముగ్గురి నుంచి రూ.17 లక్షలు తీసుకున్నాడని బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వాపోయారు.



దుగ్గిరాలలోని డాక్టర్ కొత్తరఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల గ్రంథాలయాధికారి తమ్మా రాఘవరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల అభివృద్ధి కోసం రూ. లక్ష నగదు చెక్కును కరస్పాండెంట్ కొత్త సుబ్రహ్మణ్యంకు అందించారు. డాక్టర్ కొత్త రవికిరణ్, ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొని రాఘవరెడ్డిని అభినందించారు. (దుగ్గిరాల)

రీసర్వేతో అంతా గజిబిజి

● గత తప్పిదాలే పునరావృతం
● గగ్గోలుపెడుతున్న రైతులు
● పరిష్కారానికి నోచుకోని భూసమస్యలు
● కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ (ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే భూయజమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. కూటమి అధికారంలోకి రాగానే రీసర్వేకు ఆదేశాలు ఇచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ల నిర్వాకంతో రీసర్వేలో గత తప్పిదాలే జరుగుతున్నాయి. సర్వే నెంబర్ల రీవెరిఫికేషన్‌ను సరిగ్గా చేపట్టలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా కాకుండా గ్రామ సర్వేయర్లు ఇష్టారాజ్యంగా రీసర్వే చేపడుతున్నారని, ఆన్‌లైన్లో ఒకరి భూమి మరొకరికి ఎక్కించడం, కొందరికి ఉన్న విస్తీర్ణం తగ్గించి ఎక్కించడం వంటి తప్పిదాలు కోకొల్లలుగా జరిగాయి. దీనిపై ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో వేల సంఖ్యలో అర్జీలు ఇచ్చారు. వీటి పరిష్కారం రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. ఏడు నెలలుగా బాధితులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏ ప్రయోజనం లేదు. కాగా తాము ఇచ్చిన అర్జీలు పరిష్కరించకుండానే, పరిష్కారమైనట్లు సంతకాలు చేసి ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. బ్యాంకుల్లో పంటరుణాలు పొందిన రైతులు రుణాల రీషెడ్యూల్ సమయంలో ఆన్‌లైన్లో తమ పేరు మీద పొలం లేదని, తక్షణమే రుణాలు చెల్లించాల్సిందిగా బ్యాంకు అధికారులు నోటీసులు జారీచేస్తున్నారని, దీంతో చేసేదేమిలేక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

వారసత్వ భూమి ఇతరులకు నమోదు

● కొలసాని హరిబాబు, రైతు, అన్నపర్రు



రీసర్వేలో గత ప్రభుత్వం రీసర్వేలో మా తాతల నుంచి వారసత్వంగా వస్తున్న సర్వే నెం.341-1 లో 1.18 ఎకరాల భూమిని మా గ్రామంలోని ఇతరుల పేరుమీద నమోదు చేశారు. సదరు భూమి నా పేరు మీద ఉండాల్సి ఉండగా రీసర్వేలో జరిగిన తప్పిదాలతో వేరే వారి పేరుమీదకు మారినట్లు రికార్డుల్లో చూపిస్తుంది. మాభూమి మాకు కేటాయించాలి.

కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నాం


● కాపు లక్ష్మి, మహిళా రైతు, నాగులపాడు



మండల పరిధిలోని వరగాని జిరాయితీలో సర్వే నెం.6-3లో 0.9050 సెంట్ల భూమిని 2022వ సంవత్సరంలో ఏబీపాలెంకు చెందిన పసుపులేటి అంజయ్య కుమార్తెల నుంచి కొనుగోలు చేశాము. ఆ సమయంలో ఆన్‌లైన్లో కూడా నమోదైంది. కానీ గత ప్రభుత్వంలో చేసిన రీసర్వేలో తిరిగి అంజయ్య పేరుమీదనే ఆన్‌లైన్లో నమోదైనట్లు వచ్చింది. పదేపదే ఈ విషయమై అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అర్జీలు సమర్పించినప్పటికీ పట్టించుకున్న నాథుడే లేరు.

వేరే సర్వే నెంబర్‌లో నమోదు చేశారు

● లింగమల్లు వెంకటేశ్వరరావు, రైతు, వరగాని



మా గ్రామంలో సర్వే నెం.445-7లో 3.22 ఎకరాల భూమి ఉందని ఆ భూమిని రీసర్వేలో మరొకరి సర్వే నెంబర్లోకి మార్చారు. సర్వే నెంబరు మార్చడం వల్ల బ్యాంకులో రుణం పొందేందుకు 1బీ కాపీ తీసుకొనగా వేరొకరి పేరు ఉన్నట్లు గుర్తించాం. దీనిపై పలుమార్లు దరఖాస్తులు ఇచ్చినా ప్రయోజనం లేదు. అధికారులు రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసి మా భూమి మాకు కేటాయించాలి

రీ సర్వే తప్పిదాలను పరిష్కరిస్తాం

● తహసీల్దార్ హేనాప్రియ

రీసర్వేలో తప్పిదాలపై అర్జీ చేసుకున్న రైతుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని, రైతులు భూమికి సంబంధించిన కొలతల్లో తేడాలు ఉంటే అర్జీలు దాఖలు చేయాలని, సర్వే అధికారుల ద్వారా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కొలత సమయాల్లో హద్దుదారులకు కూడా తెలియజేయాలని, కొలతలు వేసి ఆన్‌లైన్లో పొందుపరుస్తామని తెలిపారు.

సీఆర్డీఏ కార్యాలయంలో డబ్ల్యూబీ, ఏడీబీ బృందాలు

● అమరావతి అభివృద్ధి పనుల గురించి వివరించిన సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు

విజయవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందాలు విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయాన్ని సందర్శించాయి. ఈ సందర్భంగా సీఆర్డీఏ కార్యాలయంలో సోమవారం బ్యాంకుల బృందాలతో కమిషనర్ కే కన్నబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందంలోని సభ్యులకు అమరావతి నిర్మాణ పనులు, టెండర్ల ప్రక్రియలో పురోగతిని, ఇటీవల ఇచ్చిన లెటర్ ఆఫ్ అవార్డు గురించి వివరించారు. ప్రాజెక్టులు, శ్రామిక, మానవ వనరుల వినియోగం ఇతర విషయాల గురించి బృందంలోని సభ్యులకు వెల్లడించారు. వరదల నియంత్రణకు చేపట్టిన జాగ్రత్తలు, పచ్చదనం పెంపొందించడానికి చేపడుతున్న చర్యలను వివరించారు. అర్బన్, రాజధాని ప్రాంతంలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే హౌసింగ్ ప్రాజెక్టులు, రాజధాని నిర్మాణ ప్రాజెక్టుల్లో ప్రోగ్రామ్, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల భాగస్వామ్యం, ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. రాజధానిలో అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, మహిళల ప్రాతినిధ్యం, యువత, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ, పునరావాస కార్యకలాపాలు, రైతులు, రైతు కూలీల నుంచి నమోదైన అర్జీల పరిష్కారం గురించి బృందంలోని సభ్యులకు వివరించారు. అనంతరం బ్యాంకుల బృందాల సభ్యుల అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానాలిచ్చారు. అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్, సీఆర్డీఏ, అమరావతి కార్పొరేషన్ లిమిటెడ్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

మంగళగిరి సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి - తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ అను బంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద నిరసన శిబిరాన్ని ప్రారంభించారు. ఇంజనీరింగ్ కార్మికులు అర్ధనగ్నంగా ప్లేట్లు పట్టుకుని నిరసన తెలియజేశారు. నేతలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 17 రోజులపాటు మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెచేయగా, ఆనాడు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల ప్రతినిధులు శిబిరాన్ని సందర్శించి కార్మికుల నిరసనకు సంఘీభావం తెలియజేశారు. సీఐటీయూ నేతలు చెంగయ్య, ఎం రవి, బాలాజీ, సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, కే పాములు, యూ దుర్గారావు, కే శ్రీనివాసరావు, సాంబశివరావు, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 4సైట్ ఏఐ అనే సంస్థతో కలిపి సంయుక్తంగా నిర్వహించిన ఏపీ పోలీస్ 4సైట్ ఏ హాకథాన్ 2025లో కెఎల్‌యూ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని మల్టి డిసిప్లినరీ డిపార్ట్‌మెంట్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (ఎండీఐఅండ్‌ఈ) విభాగం డైరెక్టర్ నరసింహరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీఐ అండ్ ఈ విభాగం సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యు బేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐ ఐఈ) విభాగాల ఆధ్వర్యంలో ఏఐడీఎస్ హానర్స్ బీటెక్ ద్వితీయ సంవత్సరం ఇన్నో వేషన్ కోర్సు అభ్యసిస్తున్న వేదానంద ప్రణీల్ తన బృందంతో కలిసి ఈ ప్రతిష్టా త్మక పోటీలో పాల్గొని విజేతగా నిలిచారని తెలిపారు. విజేత బృందం పరిష్కరించిన సవాలు గురించి వివరిస్తూ వాట్సాప్ చాట్స్, గ్రూప్ డేటా ఆధారంగా కీలక అంశాలు ముందస్తు హెచ్చరికలు గుర్తించే ఏఐ టూల్‌ను అభివృద్ధి పరిచారని చెప్పారు. విజేత బృందాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, అధ్యాపకులు ప్రశంసించారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు



జంపాల కాంప్లెక్స్‌లో ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు

దుగ్గిరాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలను పంపిణీ చేయడం అభినందనీయమని తహసీల్దార్ ఐ సునీత తెలిపారు. చాగర్లమూడి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక జంపాల వారి కాంప్లెక్స్‌లో దోస్త్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 12 మంది ప్రతిభగల విద్యార్థులకు రూ.70వేల ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్య, వైద్యం వంటి సామాజిక సేవాకార్యక్రమాలను పన్నేండేళ్ళకు పైగా కొనసాగిస్తూ వచ్చిన దోస్త్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు, నన్నపనేని నాగేశ్వరరావు, దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, హర్ష, పీ రవియాదవ్, హైస్కూల్ హెచ్‌ఎం, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : తహసీల్దార్

కాకుమాను, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండి విద్యను అభ్యసించే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు, వారికి ప్రభుత్వం అందించే సౌకర్యాలు, తదితర అంశాల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి రోజు పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నేతలు సోమవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. మంగళగిరి పట్టణం 11వ వార్డుకు చెందిన శనగల వరప్రసాద్‌కు రూ.71,800, పగల అనసూర్యకు రూ.42,674ల చొప్పున మంజూరు కాగా, ఆయా చెక్కులను టీడీపీ నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, 11వ వార్డు అధ్యక్షుడు కారంపూడి శివరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, జంజనం చిన్న శ్రీనివాసరావు, వెనిగళ్ల ఉమాకాంతరావు, దామర్ల పరమేష్, అవ్వారు ప్రసాద్, కొమ్మూరి మారుతీ నగేష్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు (విద్య) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్పొరేట్ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో 13 మంది కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీ సర్స్ సీహెచ్. శ్రీనివాసరావు, కే సురేష్‌బాబు, కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి విభాగాధిపతి కే రమేష్‌చంద్ర తదితరులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రత్యేక సమావేశం

వట్టిచెరుకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు జూలై 7వ తేదీన 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామగ్రామాన నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఏసుపాదం మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు గ్రామాల్లో నూతన కమిటీల ఏర్పాటు, ఎమ్మార్పీఎస్ జెండాల ఆవిష్కరణ కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లేమల్లెపాడు గ్రామంలో సోమవారం వల్లభాపురపు సత్యనారాయణ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఏసుపాదంతో పాటు మండల నాయకులు బుర్రి నాగేశ్వరరావు పాల్గొని ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మీడియా సంస్థలపై దాడులు సరికాదు

మంగళగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మీడియా సంస్థలు, మీడియా ప్రతి నిధులపై దాడులు సరికాదని, ఈ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై బీఆర్‌ఎస్ నేతలు చేసిన దాడికి నిరసనగా మంగళగిరి ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించి, తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నిరసనకు వివిధ పార్టీలు, పలు సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేత కారుమంచి రామారావు, ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిలుపుదల చేసిన పింఛన్లు ఇప్పించాలి

ప్రత్తిపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆరునెలలుగా వివిధ కారణాలతో తమ పింఛన్లు నిలుపుదల చేశారని వాటిని ఇప్పించాలని కోరుతూ తహసీల్దార్ కరుణబాబుకు సోమవారం కొండేపాడు వాసులు వినతిపత్రం అందజేశారు. పింఛన్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మందులకు, అవసరాలకు లేక నానా అవస్థలు పడుతున్నామని వెంటనే పింఛన్లు పునరుద్ధరించాలని ఫిర్యాదులో తెలిపారు.

జాతీయ గ్రామీణ బంద్‌లో పాల్గొనాలి

● సీఐటీయూ మండల కన్వీనర్ రామకృష్ణ

మేడికొండూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై నెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన జాతీయ గ్రామీణ బంద్‌లో పాల్గొనాలని సీఐటీయూ మండల కన్వీనర్ బొట్ల రామకృష్ణ సోమవారం తెలిపారు. పేరేచర్ల గ్రామ పంచాయతీ వర్కర్లను కలసి ఆయన మండల సభ్యులతో కలసి బంద్ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌లో పంచాయతీ సిబ్బంది పాల్గొంటారని పంచాయతీ కార్యదర్శి కే రామసుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతక్కి రత్తయ్య, దాసు, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని మహిళలు అమ్మవారికి చీర సారె



అమ్మవారి దగ్గరకు చీర సారె, పొంగళ్లతో తుళ్లూరు నుంచి బయలు దేరిన మహిళలు

తుళ్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలు విజయవాడ కనకదుర్గమ్మకి చీర సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత తుళ్లూరులో మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. పోలేరమ్మకి నైవేద్యం పెట్టి అమ్మవారికి చీర సారె సమర్పించారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి చేరి చీరసారె పొంగళ్లు సమమర్పించారు. 2020 నుంచి అమ్మవారికి చీర సారె సమర్పిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి అమరావతిని అభివృద్ధి పట్టాలపై ఎక్కించడంతో సంతోషంగా సోమవారం ఆషాఢ మాసంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

దేవస్థానం వద్ద బస్ షెల్టర్లు ప్రారంభం

మంగళగిరి సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్, ప్రైడ్ ఆఫ్ మంగళగిరి ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధుల్లో రెండు బస్సు షెల్టర్లను ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి కే సునీల్‌కుమార్ సోమవారం ఈ బస్ షెల్టర్లను ప్రారంభించారు. ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట ఏర్పాటు చేసిన ఉచిత బస్సు కోసం భక్తులు వేచివుండేందుకు దిగువ సన్నిధిలోని ఉత్సవ గ్రౌండు, ఎగువ సన్నిధులో ఈ షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ అవార్డుల కమిటీ ఛైర్మన్ విష్ణుబాబు, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్ష, కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్ రావు, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, ఎలెక్ట్ ప్రెసిడెంట్ ప్రగడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాకట్టు భూమిని స్వాధీనం చేసుకున్నారు

గుంటూరు(తూర్పు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తాకట్టు చేసుకున్న భూమిని స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నుతున్నారని రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన చీలి భాగ్యలక్ష్మి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 18 ఏళ్ల క్రితం గ్రామంలో ఉన్న అరెకరా పొలాన్ని నల్లపాడుకు చెందిన భవనం బ్రహ్మారెడ్డి, చల్లా శ్రీనివాసరెడ్డికి తాకట్టు పెట్టి రూ.5 లక్షలు తీసుకుని ఆ డబ్బులను అప్పట్లో మరో ప్రజాప్రతినిధికి ఇచ్చామని చెప్పారు. ఆ తరువాత డబ్బులు ఇచ్చి పత్రాలును విడిపించేందుకు వారి వద్దకు వెళ్తుంటే ఏదో కారణాలు చెప్పి తప్పించుకొని తిరుగుతున్నారని తెలిపారు. ఈ మధ్యనే మమల్ని పిలిచి చక్రవడ్డీతో కలిపి రూ 50 లక్షలు అయ్యిందని, ఈ మొత్తాన్ని చెల్లించి మీ పత్రాలను తీసుకోమని చెబుతున్నారని వాపోయారు. మా భూమిని మాకు అప్పజెప్పేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో చీలి సుబ్బమ్మ, చీలి యేసయ్య తదితరులు ఉన్నారు.

దుగ్గిరాలలో 282 మందికి కంటి పరీక్షలు


దుగ్గిరాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక దోస్త్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, సర్పంచ్ కుషీబాయి శిబిరాన్ని ప్రారంభించారు. గూడవల్లి ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. దుగ్గిరాల, మంచికలపూడి, పెనుమూలి, కేఆర్ కొండూరు తదితర గ్రామాలకు చెందిన 282 మందికి కంటిపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లను, మందులను ఉచితంగా అందజేశారు. జంపాల సుబ్బారావు, చాగర్లమూడి శ్రీనివాసరావు, దుగ్గిరాల యార్డుచైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, వెనిగళ్ల శ్రీకృష్ణప్ర సాద్, గూడూరు వెంకట్రావు, వల్లూరు నరసింహారావు, గద్దె శ్రీనివాసరావు, సర్పంచ్ బీ కుషీబాయి, పసుపులేటి రవి యాదవ్, దోస్త్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం

● జనసేన మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు

తాడేపల్లి (కుంచనపల్లి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జనసేన తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కుంచనపల్లిలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జరిగిన జనసేన తాడేపల్లి మండల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమికి ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు. కూటమి ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ అభివృద్ధి సంక్షేమంపై దృష్టి పెట్టి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. అనంతరం గ్రామాల సమస్యలపై ఆయా గ్రామ అధ్యక్ష, కార్యదర్శులతో, కార్యకర్తలతో చర్చించారు. ఈ సమావేశంలో నేతలు రాష్ట్ర ఐటీ విభాగం చవ్వాకుల కోటేష్‌బాబు, కమిటీ ఉపాధ్యక్షుడు జోసఫ్ తంబి, పసుపులేటి అశోక్, కమిటీ ప్రధాన కార్యదర్శులు సీర్ల లాల్‌చంద్, తిరుమలశెట్టి శ్రీధర్, గంజి రమేష్, కార్యదర్శులు వెంపాల సాయికిరణ్, ఇండ్ల జగదీష్, పోకల హనుమ, చాముండేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు రూ. 25 వేల ఆర్థికసాయం



వేములూరిపాడుకు చెందిన గౌతమ్‌కు రూ.25వేలు వితరణ చేస్తున్న జిల్లా కుమ్మర శాలివాహన సంఘం సభ్యులు

ఫిరంగిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరుపాడు గ్రామానికి చెందిన తొర్లికొండ గౌతమ్ అనే పేద విద్యార్థి ఇంటర్మీడియట్ చదువు కోసం ఏపీ కుమ్మర శాలివాహన సంఘం ఆర్థిక సాయం అందించింది. గౌతమ్ విజ్ఞప్తి మేరకు అసోసియేషన్ రూ.25 వేలు సేకరించి అతడికి సోమవారం అందజేసింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ, ఇతర నాయకులు ఆకారపు అంకమ్మరావు, రాజవరపు శ్రీనివాసరావు, కోరంపల్లి అనిల్, కేతన పద్మారావు, మామిళ్ళపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

గుంటూరు (విద్య) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న చింతపల్లి రుక్మిణి దేవి ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని గాయత్రి ఇతర ఉపాధ్యాయులతో కలిసి రుక్మిణీదేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయిని చెన్నమ్మ, మరో పాఠశాల ఉపాధ్యాయిని ప్రమీలను ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించింది.

● **తాడేపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి కేవీఆర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి అధ్యక్షతన సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయిని డీఎల్ స్వరూపరాణిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పాఠశాలలో పని చేస్తూ బదిలీలపై, ఉద్యోగోన్నతిపై బయటకు వెళ్లిన ఉపాధ్యాయులను కూడా ఘనంగా సత్కరించారు.

ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సెంటర్ ప్రారంభం

తుళ్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలో ప్రముఖ నేత్ర వైద్యశాల అయిన ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ప్రైమరీ కేర్ విజన్ సెంటర్‌ను మందడంలో సోమవారం ప్రారంభించారు. స్థానిక లైబ్రరీ సెంటర్లో దీనిని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుళ్ళపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పురపాలక సంఘానికి రెండు అర్జీలు

తెనాలి, మారీసుపేట,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు వచ్చాయని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు తెలిపారు. సోమవారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు పలు శాఖల అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి సంబంధించి 33వ వార్డులో రోడ్డు మధ్యలో ఉన్న చెట్లను మరో ప్రాంతానికి తరలించాలని, శ్మశానవాటిక రోడ్డులో అడ్డుగా వేసిన బాదులను తొలగించాలని అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరతగతిన పరిష్కరిస్తామని లక్ష్మీపతిరావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 10 అర్జీలు

తెనాలి రూరల్,జూన్30(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.వి గోపాలకృష్ణ తెలిపారు. వాటిల్లో సర్వేకు మూడు,రేషన్ కార్డుకు సంబంధించి ఐదు, ఇతర సమస్యలతో మరో రెండు అందాయన్నారు. తెలిపిన ప్రతి సమస్యను నిర్ణిత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పలుశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో ఆరు అర్జీలు

తెనాలి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చాయి. రెవెన్యూ మూడు, మెడికల్, మున్సిపల్, పీఆర్ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు.

పూడిక వ్యర్థాలు తొలగించాలి

రోడ్లపై వేసిన పూడిక వ్యర్థాలను వెంటనే తొలగించాలని పట్టణ పరిసర ప్రాంత అబివృద్ధి సంఘం సభ్యులు కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. వీఎస్ఆర్ కళాశాల నుంచి వైకుంఠపురం వరకు కాలువల్లోని వ్యర్థాలన్నీ తీసి రోడ్డు మార్జిన్‌లలో వేశారని, రోజుల తరబడి అక్కడే ఉంచడంతో దుర్గంధంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. రాకపోకలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని సంఘ అధ్యక్షుడు దర్శి శివకోటేశ్వరరావు, అబ్రహం లింకన్, అబ్దుల్ అరీఫ్, రాజేష్, బాబుప్రసాద్ కోరారు.

సుప్రీం కోర్టు తీర్పును అమలుచేయాలి

పోలీసు శాఖలో సంస్కరణలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని గాంధీ దేశం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నగరాజన్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గాంధీ మహాత్ముని హత్యకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకుని కార్యాలయానికి వచ్చారు. భద్రత కమిషన్ ఏర్పాటు, పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు, కంప్లైంట్స్ అథారిటీ, నేషనల్ సెక్యూరిటీ కమిషన్, దర్యాప్తు శాంతి భద్రతల విభజన వంటి అంశాలలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేస్తే పోలీసుల్లో శాంతి భద్రతలపై జవాబుదారీతనం పెరుగుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ పరిహారం ఇప్పించండి

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసు కింద రావాల్సిన పరిహారం ఇప్పించాలని తెనాలి, శాంతినగర్‌కు చెందిన మీసాల కుమారి సోమవారం గుంటూరులో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. 2016లో తన కుమారుడ్ని చంపారని దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల మెట్ట భూమి, లేదంటే 2.5 ఎకరాల మాగాణి భూమి అందజేయాలని నాటి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. జీవో ప్రకారం బృందావన్ గార్డెన్స్, విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో వంట మనిషిగా ఉద్యోగాన్ని కేటాయించారని, కాని ఇప్పటివరకు భూమిని అప్పజెప్పలేదని తెలిపారు. ఉన్నతాధికారులను కలిస్తే జిల్లాలో భూములు లేవని చెబుతున్నారని వాపోయారు. కలెక్టర్ స్పందించి మాకు రావాల్సిన భూమిని అప్పజెప్పాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కార్యదర్శి ఉమాదేవి కృషి

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పని చేసిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ లక్ష్యాలు సాధించేందుకు కార్యదర్శి తుమ్మల ఉమాదేవి విశేష కృషి చేశారని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. రూరల్ మండలం సోమసుందరపాలెం కార్యదర్శిగా పని చేస్తున్న ఆమె పదవీ విరమణ సభను సోమవారం గౌతమ్ గ్రాండ్‌లో నిర్వహించారు. ఉమాదేవి - మధుసూదనరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్యదర్శి విధులు నిర్వహించి ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. పలువురు కార్యదర్శులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతికి సత్కారం

తెనాలి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిని సీతారామ స్వామి ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. పట్టణంలోని రజకపేటలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రజక సాధికార సంస్థ డైరెక్టర్ మునిపల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేస్తున్నారని అభినందించారు. కౌన్సిలర్ మునిపల్లి ప్రసాద్, రామకృష్ణ, కామేశ్వరరావు, శంకర్, శ్రీకాంత్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు దక్కించుకున్నా పనులు మాత్రం చేయరు

● మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం
● అధికారుల తీరుపై అసహనం
● 24 అంశాలు ఆమోదం



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, అధికారుల తీరును ప్రశ్నిస్తున్న వైస్‌చైర్మన్ హరిప్రసాద్, టీడీపీ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు.

తెనాలి, మారీసుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు నిర్వహించిన టెండర్లను కాంట్రాక్టర్లు దక్కించుకుంటున్నారే తప్ప పనులు మాత్రం చేయరని దీంతో అభివృద్ధి పనులు కుంటుపడటంతో పాటు సమస్యల పరిష్కారం కాకపోవడంతో వార్డు ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నామంటూ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. వాటిలో అభివృద్ధి కాంట్రాక్టు పనుల గురించి చర్చకురాగా అధికార, ప్రతిపక్ష సభ్యులు టెండర్లు దక్కించుకోవడం మినహా పనులు చేపట్టనప్పుడు అభివృద్ధి పనులు పేరుతో కాంట్రాక్టులు ఇవ్వడం ఎందుకంటూ పలువురు కౌన్సిల్ సభ్యులు చైర్‌పర్సన్ రాధికను ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ సభ్యులు అడిగిన విషయంలో వాస్తవం ఉందని బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. గతంలో టెండర్లు దక్కించుకొని పనులు చేయని కాంట్రాక్టర్లకు మరలా తిరిగి వారికే కాంట్రాక్టులు ఇస్తున్నారంటూ 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరావు ప్రశ్నించారు. దీనిపై చైర్‌పర్సన్ సమాధానమిస్తు ఆన్‌లైన్ టెండర్ విధానం అమలు చేయడంతో ఏమిచేయలేని పరిస్థితి ఏర్పడిందని సమస్యలపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు బదులిచ్చారు.

30వ వార్డు కౌన్సిలర్ మానసారెడ్డి తమ వార్డులో కొన్ని నెలల క్రితం అభివృద్ధి పనులకు టెండర్లు పిలవగా ఇంతవరకు ఎటువంటి పనులు ప్రారంభించలేదని, ఈ విషయాన్ని చైర్‌పర్సన్ దృష్టికి పలుమార్లు తీసుకువచ్చినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సమాధానం చెప్పాలని మున్సిపల్ డీఈని చైర్‌పర్సన్ కోరారు. డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టామని త్వరలోనే ఆ పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ తమ వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల సమాచారం ఎందుకు ఇవ్వటంలేదని ప్రశ్నించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సమాధానమిస్తూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మరోసారి ఇలా జరగదని తెలిపారు. ఇదే సందర్భంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై అహసనం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ ప్యానల్ సభ్యులుగా 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, 20వ వార్డు కౌన్సిలర్ దేసు యుగంధర్, 12వ వార్డు కౌన్సిలర్ కొర్ర యశోద రమావత్, 30వ వార్డు కౌన్సిలర్ కొమరబత్తిన జయపాల్‌ను, ఉద్యోగుల డైరెక్టు నియామక కమిటీ పానల్‌గా 22వ వార్డు కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, 3వ వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య, 17వ వార్డు కౌన్సిలర్ అన్నం పిన్నారావులను కౌన్సిల్ సభ్యులు నామినేట్ చేశారు. పలువురు కౌన్సిల్ సభ్యులు తమ వార్డు సమస్యలను పరిష్కరించాలని చైర్‌పర్సన్ రాధిక దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం 24అంశాలు చదవడం పూర్తికాగానే అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు కౌన్సిల్ సభ్యులు చెప్పడంతో కౌన్సిల్ సమావేశం ముగిసినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. ముందుగా ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన వీఎం లక్ష్మీపతిరావు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్‌శర్మ, డీఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులను కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్ శర్మ, ఆర్‌వో రాంప్రసాద్, డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసు, ఏఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్ అన్న గౌరవం లేదు: హరిప్రసాద్

పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అధికారులు వైస్‌చైర్మన్ అన్న కనీస గౌరవం లేకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్‌హాల్ నందు జరిగిన సాధారణ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అధికారుల తీరును తప్పుపట్టాను. 24వ వార్డులో తాగునీటి సమస్యను గురించి ఏఈ సూరిబాబుకు ఫోన్ ద్వారా సమస్యను తెలియజేద్దామనుకుంటే అందుబాటులోకి రాలేదని ఎన్నిసార్లు సమస్యను పరిష్కరించాలని కోరిన పరిష్కరించలేదని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఎదుట ప్రస్తావించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా ఉన్న తనకే అధికారులు సరిగా స్పందించకుంటే సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకుంటేనే బాధ కలుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరులో మార్పు రాకుంటే పురపాలక సంఘంపై ప్రజలకు ఉన్న విశ్వాసం సన్నగిల్లిపోనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ సూరిబాబు ఎంతో కీలకమైన మంచినీటి సరఫరా బాధ్యత చూస్తారని అటువంటి ఉద్యోగి సైతం తాను సమస్యను తెలిపేందుకు ఫోన్ చేస్తే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దీనిపై చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ ఎవరైనా సమస్యల పట్ల బాధ్యతారహితంగా వ్యహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆపన్నహస్తంలా సీఎం రిలీఫ్ ఫండ్: ఆలపాటి

తెనాలి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులకోసం ఎదురుచూస్తున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తంలా నిలుస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఇటీవల సాయంకోసం అర్జీలు పెట్టుకున్న పలవురికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా విడుదల చేసిన చెక్కులను ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు చినకోటిరెడ్డి, టీడీపీ నాయకులు

పేద ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి

కొల్లిపర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జంగా నాగబుల్లెమ్మకు రూ.50వేలు, దొడ్డా స్వాతి రూ.24వేలను టీడీపీ మండల అధ్యక్షుడు చినకోటిరెడ్డి, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి బాధితుల అనారోగ్యం గురించి తీసుకెళ్ళడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు రావడంతో వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంతు చంద్రిక, షేక్ రఫీ, వల్లభాపురం బసవయ్య, కేసన పోతురాజు, విస్సారపు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 41మందికి ఉద్యోగాలు



నియామకపత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్, 30 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాలో 41 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చేబ్రోలు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. 263 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 41మంది మొదటి దశలో ఎంపికయ్యారు. మరో 21 మంది తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేళాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.ఈశ్వరరావు, స్కిల్ హబ్ అధికారి ఏవీ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ ఏ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులను స్కీం వర్కర్లుగా గుర్తించాలి

● సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి

కొల్లిపర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులను స్కీం వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి అన్నారు. సోమవారం జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాపిత సమ్మెలో భాగంగా మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, వివిధ కార్మిక సంఘ నాయకులు జి.సుందరరావు, ఎం.రమేష్, పి.ఏసుపాదం, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్‌పై కేసు నమోదు

పెదకాకాని, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తక్కెళ్లపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఒక భూమికి సంబంధించిన వ్యవహారంలో జరిగిన అక్రమాలతో సంబంధం ఉన్న వలంటీర్‌పై కేసు నమోదు చేసినట్లు సోమవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం తక్కెళ్లపాడుకు చెందిన ఆ వలంటీర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఒక భూమి విషయంలో అక్రమాలకు పాల్పడ్డట్టు ఆరోపణలు వచ్చాయి. అక్కడ స్థలాన్ని ఉన్నట్లుగా చూపించి మరొక చోట స్థలం విక్రయించగా ఈ వ్యవహారం మొత్తంలో ఆ వలంటీరే అక్రమాలకు పాల్పడ్డట్టు ఫిర్యాదు అందింది. దీంతో ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్‌హక్

నూతనంగా 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

● తహసీల్దార్ జియావుల్‌హక్

పొన్నూరు టౌన్, జూన్, 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో నూతనంగా 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పోలింగ్ బూత్‌లపై సమీక్ష జరిగింది. 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంపై చర్చించారు. పొన్నూరు అర్బన్‌లో 8, చేబ్రోలు మండలంలో 2, పెదకాకాని మండలంలో 3 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,27,532మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

పంట, మురుగు కాలువలకు మరమ్మతులు

పొన్నూరు టౌన్, జూన్, 30 (ఆంధ్రజ్యోతి): పంట, మురుగు నీటి కాలువల మరమ్మతులకు ప్రభుత్వం సహకారమందిస్తోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని జూపూడిలో మీడియం డ్రైనేజీ కాలువ మరమ్మతులు, పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. ఐదు కిలోమీటర్ల మేర కాలువ పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకానికి ప్రోత్సాహం

● ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెరటి తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం డ్వాక్రా మహిళలకు రాయితీపై కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. 11రకాల కూరగాయల విత్తనాలను ఒక్కో ప్యాకెట్ రూ.70ధరకు 24 గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెరటితోటల్లో కూరగాయలు, ఆకుకూరలు సేంద్రీయ పద్ధతుల్లో సాగుచేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని స్వీకరించడం, కుటుంబ వ్యయాన్ని తగ్గించుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన కలిగే నష్టాలను వివరించారు. సేంద్రీయ పద్ధతిలో ఆహార పదార్థాలను పండించి స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఏపీఎం జోయబాబు, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, జనసేన నాయకులు యలవర్తి వెంకటేశ్వరరావు, వెన్ను రామారావు, గరికపాటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వర్షాలు పడుతున్నాయని అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాల్వల్లో ఉన్న మురుగునీటిని తొలగించి బ్లీచింగ్‌ను చల్లించాలన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. దోమల మందులను పిచికారీ చేయించాలన్నారు. బహిరంగా మల విసర్జనను నిర్మూలించటానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బిల్డర్లు

తెనాలిలో బిల్డర్ల నిరసన

● నిబంధనల పేరుతో 11 నెలలుగా నిర్మాణాల నిలిపివేతపై ఆవేదన

తెనాలి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అనుమతులు పొంది నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను కొనసాగించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ తెనాలిలో బిల్డర్లు సోమవారం నిరసన తెలిపారు. సోమవారం తెనాలిలోని బస్టాండ్ సమీపంలో పనులు నిలిచిపోయిన బిల్డింగ్‌ల వద్ద నిర్మాణ సామగ్రిని తీసుకువస్తున్న క్రమంలో మునిసిపల్ అధికారులు అడ్డుతగలడంతో బిల్డర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణాలకు అనుమతులు పొంది పనులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిబంధనల పేరిట బిల్డింగ్ నిర్మాణాలను ఆపివేయాలంటూ ఆదేశాలివ్వడంతో దాదాపుగా 11 నెలల నుంచి నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మునిసిపల్ అధికారులు బిల్డర్ల వద్దకు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గతంలో అనుమతులు ఇచ్చి ఇప్పుడు ఆ అనుమతులు చెల్లవంటూ చెప్పటంపై ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు పెట్టుబడిపెట్టి నిర్మిస్తున్న భవన నిర్మాణాలను ఆపివేయించడం ఎంతవరకూ సబబు అంటూ అధికారులను నిలదీశారు. నిర్మాణాల కొనసాగింపును అనుమతివ్వకుంటే ఆత్మహత్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఆలపాటిని కలిసిన బిల్డర్లు

తెనాలిలో మంత్రి మనోహర్ అందుబాటులో లేకపోవడంతో బిల్డర్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి వారి ఆవేదనను వెలిబుచ్చారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలు ప్రారంభించి పూర్తికావస్తున్న సమయంలో దాదాపుగా సంవత్సరకాలంగా పనులు నిలిపివేశారన్నారు. నూతనంగా కట్టే వాటికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులకు లోబడి కడతామని నిలిచిపోయిన బిల్డింగ్‌లకు అనుమతులు ఇప్పించాలంటూ కోరారు. స్పందించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావుతో ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి మనోహర్ వచ్చాక బిల్డర్ల సమస్యలపై ఇద్దరం చర్చిస్తామని భవన నిర్మాణాలను అడ్డుకోవద్దని కోరారు. అనంతరం ఆలపాటి బిల్డర్లకు ధైర్యం చెప్పి పంపించారు.

పౌరుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

● తహసీల్దార్ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, పక్కన ఎంపీడీవో దీప్తి

తెనాలి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సంగంజాగర్లమూడిలో ఎంపీడీవో అత్తోట దీప్తి, రూరల్ పోలీసులతో కలిసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే ఫిర్యాదుచేసే విధానాన్ని వివరించారు.

పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలు నాటాలి

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి, మారీసుపేట,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక నందులపేట కవిరాజా పార్కులో పర్యావరణవేత్త మెత్ర నాగరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తహసీల్దార్ గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణవేత్త నాగరాజు గత 18 సంవత్సరాల నుంచి వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమలో కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, పాపిరెడ్డి, మేత్ర కృష్ణమూర్తి, దాసరి మారుతి శంకర్, బెల్లంకొండ మోహనరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాక్సిడెంట్ కేసులో ఇద్దరికి జరిమానా

కొల్లిపర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా మోటర్ సైకిల్ నడిపి వ్యక్తి మరణానికి కారణమైన వ్యక్తికి, లైసెన్సు లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన వ్యక్తికి రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. వివరాలు ప్రకారం 2020 సంవత్సరం మే నెల 10వతేదీన కొల్లిపర మండలం చివలూరు గ్రామానికి చెందిన డి.లూథర్ బహిర్భూమికి వెళ్ళగా నందివెలుగు వైపు నుంచి కొలకలూరు వైపు వెళుతున్న నెంబర్‌లేని మోటర్‌సైకిల్ లూథరన్ని ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. అదేసమయంలో మరొక మోటార్ సైకిల్ వచ్చి లూథరన్‌ని ఢీకొనటంతో లూథరన్‌ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసులో లైసెన్సు లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన నేరానికి బైక్ యజమాని మణ్యం వెంకటశివకి రూ.5వేలు, బైక్ నడిపిన వ్యక్తి మోర్ల శివగోపికి రూ.5వేలు జరిమానా విధిస్తూ రెండో అదనపు జూనియర్ జడ్జి పి.రాజశేఖర్ తీర్పు వెలువరించారు. ఈ కేసును సీనియర్ ఏపీపీ సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించగా అప్పటి కొల్లిపర ఏఎస్ఐ అర్జునరావు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ బలరామిరెడ్డి కోర్టులో చార్జిషీటు దాఖలు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

● మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

కొల్లిపర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లైసెన్సు లేకుండా వరి విత్తనాలను అమ్మితే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తూములూరు, మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం గ్రామాల్లో వరి విత్తనాల షాపులను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ షాపుల్లో అమ్ముతున్న విత్తనాలను మొలకశాతం పరీక్ష చేయటానికి శాంపిల్స్‌తీసి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో నారుమళ్ళు పోసేటప్పుడు రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. వరి, మినుము పంటలువేసే రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాని, ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ చేయించుకుంటే బీమా పథకం పొందటానికి అవకాశం ఉందన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తీసుకోవాలన్నారు.

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠినచర్యలు: కమిషనర్

పొన్నూరు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు హెచ్చరించారు. పొన్నూరులో పలు ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు ఇస్తే వ్యాపారులకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.